
నాగనాతనహళ్లిలో ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్‌కు డిక్లరేషన్ ఫారం ఇస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

రైతుల్లో పట్టు బిగించే సాగునీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయుఏ) ఎన్నికల్లో టీడీపీ కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఓటమి తప్పదని ముందే పసిగట్టిన వైసీపీ ఎన్నికలను బహిష్కరిస్తూ బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అయినా పలుచోట్ల వైసీపీ మద్దతు దారులు పోటీకి సిద్ధపడి.. ఓటమి తప్పదని వెనకడుగు వేశారు. దీంతో అధికార టీడీపీ కూటమి మద్దతుతో బరిలో దిగిన అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. పలు గ్రామాల్లో టీసీ సభ్యుల ఎన్నికలో టీడీపీ, వైసీపీ నేతలు రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి స్థానాలను పంచుకున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆలూరులో వైసీపీ ఎన్నికలకు దూరంకాగా టీడీపీ వర్గాల్లోనే పోటీ నెలకొంది. జిల్లాలో 123 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగితే అన్ని సంఘాలు ఏకగ్రీవమయ్యాయి. అందులో రెండు సంఘాలు వైసీపీ ఖాతాల్లో చేరాయి.



జల సంఘాల్లో కూటమి పట్టు

- సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం
- 121 సంఘాలు టీడీపీ మద్దతుదారుల కైవసం
- మంత్రాలయంలో రెండు డబ్ల్యూయుఏలు దక్కించుకున్న వైసీపీ
- ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే, పోలీసుల మధ్య వాగ్వాదం
- ఆలూరులో టీడీపీ వర్గాల మధ్యే పోటాపోటీ


పార్లపల్లిలో రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యేకు నచ్చజెప్పుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

కర్నూలు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్, కేసీ కెనాల్, హంద్రీనీవా ప్రాజెక్టు, గాజులదిన్నె ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ చెరువుల నిర్వహణ కోసం ప్రభుత్వం సాగునీటి వినియోగదారుల సంఘాలు (డబ్ల్యూయుఏ)లకు శనివారం ఎన్నికలు నిర్వహించింది. 2015 తర్వాత తొమ్మిదేళ్లకు ఈ ఎన్నికలు జరిగాయి. దీంతో పల్లెల్లో పట్టుకోసం రాజకీయ పార్టీలు సాగునీటి సంఘాలను అస్త్రంగా ఉపయోగించుకున్నారు. జిల్లాలో 123 డబ్ల్యూయుఏల పరిధిలో 1,212 టీసీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ శనివారం ఉదయం 8 గంటలకే మొదలైంది. డబ్ల్యూయుఏ ఎన్నికల ఆథరైజేషన్ అధికారి పర్యవేక్షణలో టీసీ సభ్యుల ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించారు. డబ్ల్యూయుఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎంపిక కావాలంటే టీసీ సభ్యుడిగా ఎన్నిక అనివార్యం. దీంతో డబ్ల్యూయుఏ అధ్యక్ష పదవులు ఆశించే బడా నాయకులు సైతం టీసీ సభ్యుడి కోసం నామినేషన్లు వేసేందుకు తమ అనుచరులతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. టీసీ ఎన్నికల సహాయ అధికారి పర్యవేక్షణలో నామినేషన్లను స్వీకరించారు. 9:45 గంటలకు నామినేషన్ల స్వీకరణ మొదలు కావడంతో.. పలుచోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపక్ష వైసీపీ ఎన్నికలను బహిష్కరించిన సంగతి తెలిసిందే. అయినా పోటీ జరిగితే విజయం సాధించేదిశగా టీడీపీ కూటమి పార్టీలు వ్యూహాత్మకంగా ఎన్నికల బరిలోకి దిగారు. అదే క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బూదూరులో పోలింగ్ కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న డీఎస్పీ




పెద్ద కడుబూరు: బయటకు పంపిస్తున్న ఎస్ఐ డాక్టర్ నాయక్

ఎర్రకోట వర్సెస్ పోలీస్

ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. నీవెంత..అంటే నీవెంత అనే స్థాయిలో వాదనలు చోటు చేసుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట కలుగొట్లకు పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే తాను వెళ్లాల్సిందేనని, తమ పార్టీకి చెందని రైతులను అనుమతించడం లేదని ఎర్రకోట పట్టుబట్టారు. రైతులు ఉంటే పంపండి మేము తీసుకెళ్తాం.. నిన్నుమాత్రం లోపలకి అనుమతించమని పోలీసులు చెప్పడంతో రోడ్డుపైన బైఠాయించాడు. మళ్లీ అక్కడి నుంచి పార్లపల్లికి మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట వెళ్లారు. అక్కడ సైతం పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా కర్నూలు సీసీఎస్ సీఐ ఇబ్రహీం అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎర్రకోటతో పాటు ఆయన అనుచరులు బలవంతంగా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించంగా అడ్డుకున్న పోలీసులను సైతం తోసుకొని లోపలకి వెళ్తుండగా.. 'వయసులో పెద్దవాడివని.. సీనియర్ నాయకుడని గౌరవిస్తే మమ్మల్నే తోయడం కాకుండ దురుసుగా మాట్లాడుతారా..' అంటూ సీఐ ఆవేశంగా మాట్లాడారు. ఎర్రకోట సైతం నీ అంతు చూస్తాననేలా మాట్లాడడంతో.. సీఐ సైతం అదేస్థాయిలో 'పెద్దవాడివని ఎంతో గౌరవించినా మీ వయసుకు తగ్గట్టు మాట్లాడండి' అంటూ గట్టిగానే జవాబు ఇచ్చారు. దీంతో ఆయన అక్కడే ఎన్నికలు ముగిసే వరకు బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెద్దకడుబూరులో టీడీపీ నాయకులు బసవాసి అయ్యాళప్ప, వైసీపీ సీనియర్ నాయకులు బసవాసి బసిరెడ్డి మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. టీడీపీ, వైసీపీ నేతలు టీసీ సభ్యులను పంచుకోవడంతో ఇదెక్కడి చోద్యమంటూ బసవాసికి చెందిన అయ్యాళప్ప ఎన్నికలను బహిష్కరించి వెళ్లిపోయారు. హాలహర్వి మండలం చింతకుంటలో టీడీపీ వర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి వర్గాల మధ్య పోటీ జరిగింది. నందవరం మండలం కనకవీడులో మూడు టీసీ సభ్యులకు ఎన్నికలు అనివార్యం అయితే.. రెండింటిని టీడీపీ మద్దతు దారులు, ఒక స్థానంలో వైసీపీ మద్దతు దారులు కైవసం చేసుకున్నారు. ఆదోనిలో టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల అధ్యక్ష స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది.

సత్తా చాటిన టీడీపీ

జిల్లాలో 123 డబ్ల్యూయుఏలు, వాటి పరిధిలోని 1,212 ప్రాదేశిక నియోజకవర్గాలు(టీసీ) సభ్యులకు ఎన్నికలు జరిగాయి. పక్కా వ్యూహంతో ఆయా నియోజకవర్గాల టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం, మండలాల ముఖ్య నాయకులు, గ్రామస్థాయి నాయకులు నీటిసంఘాల ఎన్నికలపై దృష్టి సారించడంతో మొత్తం ఏకగ్రీవం చేసుకోగలిగారు. 1,212 టీసీ సభ్యుల్లో 1,190 టీసీ సభ్యులకు ఎన్నికలు జరిగితే మొత్తం ఏకగ్రీవమయ్యాయి. అందులో దాదాపు 25కు పైగా వైసీపీ మద్దతుదారులు టీడీపీ నేతలతో రాయబేరాలు చేసి ఏకగ్రీవంగా దక్కించుకున్నారు. వివిధ కారణాల వల్ల ఎల్లెల్సీ పరిధిలో 18, కేసీ కెనాల్ పరిధిలో 2, గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో 2 టీసీ సభ్యులకు ఎన్నికలు జరగలేదు. 123 డబ్ల్యూయుఏలకు గాను 120 టీడీపీ, ఒక స్థానంలో జనసేన ఏకగ్రీవంగా చేసుకోగా మంత్రాలయం నియోజకవర్గంలో కగ్గల్లు మైనర్ ఇరిగేషన్ చెరువు, రాంపురం ఛానెల్ కెనాల్‌కు చెందిన రెండు డబ్ల్యూయుఏలను వైసీపీ దక్కించుకుంది. ఆలూరు నియోజకవర్గంలో హాలహర్వి, హొళగుంద, చిప్పగిరి మండలాల్లో ఎల్లెల్సీ, హెచ్ఎల్సీ - ఏబీసీ పరిధిలోని డబ్ల్యూయుఏ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉంటే టీడీపీలో ఆ పార్టీ ఇన్‌చార్జి వీరభద్రగౌడు, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ వర్గాలు పోటీ పడ్డాయి. దీంతో టీసీ సభ్యులు, డబ్ల్యూయుఏ అధ్యక్ష పదవుల పంపకాలు చేసుకోవాల్సి వచ్చింది. హెబ్బటంలో రెండు చెరువులకు చెందిన నీటి సంఘాల అధ్యక్ష ఎన్నికల్లో సయోధ్య కుదరకపోవడంతో వాయిదా పడ్డాయని అధికారులు భావించారు. అయితే రాత్రి 7:30 గంటల తర్వాత రెండు వర్గాలు చెరో ఒక సంఘం పంచుకోవడంతో ఏకగ్రీవంగా ముగిశాయి.

డబ్ల్యూయూఏ, టీసీ సభ్యుల స్థానాలు, ఎన్నికలు జరిగిన స్థానాల వివరాలు

ప్రాజెక్టు	టీసీ	ఏకగ్రీవం	పెండింగ్	డబ్ల్యూయూఏ	ఏకగ్రీవం
టీబీపీ ఎల్లెల్సీ	696	678	18	58	58
కేసీ కెనాల్	24	02	02	02	02
ఆలూరు బ్రాంచ్ కెనాల్	72	72	--	06	06
హంద్రీనీవా ప్రాజెక్టు	24	24	--	03	03
గాజులదిన్నె ప్రాజెక్టు	144	142	02	12	12
యంఐ చెరువులు	252	252	--	42	42
మొత్తం	1212	1191	22	123	123


టిడ్కో ఇళ్ల సముదాయంలో మొలిచిన ముళ్లకంప చెట్లు

మీరూ అంతేనా..?

- టిడ్కో ఇళ్ల కోసం ఎదురు చూపులు....!
- కూటమి ప్రభుత్వం వచ్చాక సొంత ఇండ్లలోకి వెళ్లవచ్చనుకున్న లబ్ధిదారులు
- కనీస వసతులు కల్పించని కూటమి ప్రభుత్వం
- నత్తనడకగా సాగుతున్న పనులు
- రూ.30 కోట్లకుపైగా ప్రతిపాదనలు

ఆదోని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో టిడ్కో ఇళ్లపై గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కక్షపూరితంగా వ్యవహరించింది. సొంతింటి కల సాకారమైందని గంపెడాశతో టిడ్కో గృహాల్లో చేరిన లబ్ధిదారులను సమస్యలు చుట్టుముట్టాయి. కొంతమంది లబ్ధిదారులకు అధికారులు ఇళ్ల తాళాలు ఇచ్చారేగాని వసతులు కల్పించలేదు. మొక్కుబడిగా ప్రారంభోత్సవాలు చేయించి తమ పని అయిపోయిందని చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సమస్యలను పరిష్కరిస్తుందని లబ్ధిదారులు అనుకున్నారు. ఆరునెలలు గడచిపోయాయి. 90 శాతం పూర్తయిన ఇండ్లలో మిగతా పనులు పూర్తి చేయించడానికి, వసతులు కల్పించడానికి ఆరునెలల టైం సరిపోయేదే. కానీ ప్రభుత్వానికి ఆ ఊసే లేదని ఆచరణలో కనిపిస్తోందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో టిడ్కో ఇండ్ల విషయంలో చేసిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. మీరు కూడా వైసీపీ ప్రభుత్వంలాగేనా? అని సందేహిస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లపనులు 90శాతం మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఆ 10 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. ఎన్నికలకు ఏడాది ముందు వాటిని తూతూమంత్రంగా పూర్తి చేసి మమ అనిపించింది. ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో ఏడాది కింద టిడ్కో ఇండ్లను లబ్ధిదారులకు అప్పగించారు. అయితే హడావుడిగా కొంతమందికి లబ్ధిదారులకు తాళాలు ఇచ్చారు. ఆ ఇండ్లలో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు.


మౌలిక సదుపాయాలు ఎక్కడ?

టిడ్కో గృహ సముదాయాల నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. ఏడాది దాటినా కనీస వసతులపై దృష్టి పెట్ట లేదు. ఆదోని సిరుగుప్ప రోడ్డులో నిర్మించిన 4,720 ఇండ్లు పూర్తి చేస్తే 1,512 మందికి తాళాలు ఇచ్చారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 4272 ఇళ్లు పూర్తికాగా అందులో 2వేలు మందికి తాళాలు ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా టిడ్కో సముదాయంలో కనీస వసతులు లేకపోవడంతో నివాసముండేందుకు లబ్ధిదారులు వెనకడుగు వేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది.


టిడ్కో ఇళ్లకు వెళ్లే దారి

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా

టిడ్కో ఇళ్లు నిర్మించిన చంద్రబాబు ఐదేళ్ల తరువాత మళ్లీ అధికారంలోకి వచ్చారు. ఆరు నెలలైనా ఇంతవరకు టిడ్కో ఇండ్లను పూర్తి చేయడంలో, సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు మాత్రం లబ్ధిదారులు అక్కడ నివాసం ఉండాలని చెప్పినా వసతులు లేకపోవడంతో లబిదారులు సాహసించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ముళ్ళ కంపలు మొలచాయి. నివాసముండే ఇండ్లకు కనీస సౌకర్యాలైన తాగు నీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు లేవు.


టిడ్కో ఇళ్లు

మిగతా 6లో

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది


ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా స్థానిక లోక్ అదాలత్ భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోను కాకుండా లోక్ అదాలత్‌లను ఆశ్రయించాలని, సివిల్ క్రిమినల్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న వివిధ కోర్టులలో న్యాయాధికారుల ఆధ్వర్యంలో కేసులను పరిష్కరించేందుకు 21 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బెంచ్‌లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కర్నూలులో 6,211 కేసులు, ఆదోనిలో 1,306 కేసులు, ఆళ్లగడ్డలో 246 కేసులు, ఆలూరులో 248, ఆత్మకూరులో 126, బనగానపల్లెలో 329, డోన్‌లో 419, కోవెలకుంట్లలో 265, నందికొట్కూరులో 310, నంద్యాలలో 1,621 కేసులు, పత్తికొండలో 73 కేసులు, ఎమ్మిగనూరులో 1,594 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 268 ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. పరిష్కారమైన కేసులలో రూ.10,01,33,939 విలువైన వివాదాలను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. వీటిలో అత్యధికంగా మోటారు వాహనాల ప్రమాదాల కేసులలో రూ.6,36,72,000ను పరిహారంగా బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. కర్నూలు బెంచ్‌లో న్యాయాధికారులు పి. పాండురంగారెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, పి. దివాకర్, ఎం. సరోజినమ్మ, జి. వందన, సీనియర్ న్యాయవాదులు వై. జయరాజు, పి. శివసుదర్శన్, బి. సుధారాణి, న్యాయవాదులు ఎన్. వెంకట్రావు, డి. మధుసూదన్‌రావ తదితరులు పాల్గొన్నారు.

న్యాయశాఖ మంత్రికి సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న లీగల్ సెల్ నాయకులు

కర్నూల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం అయ్యేలా, అది అమలయ్యేలా కృషి చేస్తున్న న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను శనవారం నంద్యాలలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో లీగల్ సెల్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ఉపాధ్యక్షులు దాశెట్టి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి శ్రీనివాసభట్టు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, బీజేపీ న్యాయ విభాగం అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జనసేన లీగల్ సెల్ నాయకుడు సురేష్, జిల్లా టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి ఎల్వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు హరినాథచౌదరి తదితరులు పాల్గొన్నారు.

18న కిసాన్ మేళా



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏడీఆర్ జాన్సన్

నంద్యాల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి); నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఈనెల 18న రైతు మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ సహాయ సంచాలకుడు డాక్టర్ జాన్సన్ తెలిపారు. శనివారం స్థానిక పరిశోధన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు, ఆవిష్కరణల గురించి రైతులకు అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మేళా సందర్భంగా రైతులకు అభివృద్ధి పరిచిన నూతన వంగడాలతో పాటు ఇతర సాంకేతిక పద్ధతుల ప్రదర్శన క్షేత్ర సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ మేళాలో మెట్ట ప్రాంతాలైన నాలుగు జిల్లాల నుంచి సుమారు 2000 మంది పాల్గొననున్నట్లు తెలిపారు. కిసాన్ మేళాను విజయవంతం చేయాలని కోరారు. ఈసమావేశంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సస్యరక్షణ) డాక్టర్ రామకృష్ణారావు పాల్గొన్నారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ ఆధ్వర్యంలో, చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం 4 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ తెలిపారు. కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో, ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని నందవరం మండలం, కనకవీడు గ్రామంలో, ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని దేవనకొండ మండలం మాచాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఉంటాయని తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు.

కళ

మళ్లీ మళ్లీ చూసేలా



ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్

సందేశమిచ్చే సూక్ష్మ చిత్రాలు

మల్లికార్జున ప్రతిభకు నిదర్శనాలు



చిత్రాన్ని చూపుతున్న మల్లికార్జున



చాక్ పీస్‌పై నమాజు చేస్తున్న ముస్లిం

ఆదోని, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి):

ఆయన కుంచెకు చూపుంటుంది. ఆలోచన ఉంటుంది. ఆయన చేతి వేళ్ల నుంచి అద్భుత సూక్ష్మ చిత్రాలు జాలువారుతాయి. ఆయనే ఆదోని మండలం నారాయణపురం గ్రామానికి చెందిన మల్లమ్మ, గర్జన్న దంపతుల కుమారుడు మల్లికార్జున. ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామంలోని జడ్పీ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడం అలవాటు. ఆకులు, వక్కలు, చాక్ పీసులు, గంధపు చెక్కలు, గ్రానైట్ రాయిపై సూక్ష్మ చిత్రాలు గీస్తూ తన కళాత్మకతతో అందర్నీ ఆకట్టుకుంటున్నారు. పెన్సిల్, పెన్ను, పెయింటింగ్, డిజిటల్ పెయింటింగ్‌తో కళాకృతులు తయారు చేస్తున్నారు. దేశ నాయకులు, వినాయక చవితి, రంజాన్, క్రిస్మస్ తదితర పండుగల ప్రాధాన్యం తెలిపేలా చిత్రాలు గీయడం ఆయన ప్రత్యేకత. మాతృ దినోత్సవం సందర్భంగా గీచిన చిత్రాలు ఆకట్టుకుంటాయి. ఇటీవల కర్నూలు జిల్లాలో ఎస్పీగా పని చేసిన ఆకే రవికృష్ణ ఎదుట ఆయన చిత్రం గీచి ఆయనకు బహుమతిగా ఇచ్చి మన్ననలు పొందారు. ఏ బొమ్మ గీచినా దానికి ప్రాణం పోసే మల్లికార్జున పలువురి అభినందనలు అందుకున్నారు.



కంది బేడపై వినాయక ప్రతి రూపాలు







గ్రానైట్ బండపై దేశ నాయకుల ఫొటోలు

మీరూ అంతేనా?

(5వ పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వం, 4,720 గృహాలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.50 కోట్లు ఖర్చు చేసింది. రంగులు వేయకుండా ప్రహరీ నిర్మాణం, విద్యుత్, తాగునీటి సౌకర్యానికి ఈ డబ్బు ఉపయోగించి ఉంటే టిడ్కో ఇళ్లల్లో లబ్ధిదారులు కాపురాలు ఉండేవారు. ప్రస్తుతం ఆ గృహ సముదాయాలలో విష పురుగులు స్థావరాలు ఏర్పరచుకున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇళ్ల చుట్టూ ప్రహరీ నిర్మించి కనీస అవసరాలు కల్పిస్తే ఆ ఇండ్లల్లోకి చేరేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారు.



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు పనులు నిలిపి వేసిన దృశ్యం



టిడ్కో ఇంటి సైడ్ ప్రొటెక్షన్ వాల్ పడిపోతుండగా అడ్డుగా ఉంచిన రాడ్

కనీస సౌకర్యాలు కల్పిస్తే చేరుతాం



రహదారులు, కనీస సౌకర్యాలు కల్పిస్తే ఇలలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నాం. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ సమస్య తీర్చకుండా ఎట్లా ఉండాలి? ఐదు ఏళ్ళగా సొంత ఇంట్లో ఉండాలని అనుకుంటున్నాం. ప్రభుత్వాలు పట్టించుకోవాలి.

-పార్వతి, రాయనగర్, ఆదోని

సొంతింటి కల ఎప్పుడు నెరవేడుతుందో..



సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందో తెలియడం లేదు. కొంతమందికి తాళాలు ఇచ్చారు. వారు కూడా ఇక్కడ నివాసం ఉండడానికి వెనకాడుతున్నారు. దీనంతటికీ కారణం ఇక్కడ కనీస సౌకర్యాలు కల్పించకపోవడమే.

-లలితమ్మ, శుక్రవారపేట, ఆదోని

అద్దె ఇంట్లో ఉంటున్నాం



నాలుగు వేలు ఇచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. సొంతిల్లు ఉందంటే ఈ మొత్తం మిగులుతుంది కదా.. కానీ అక్కడ సౌకర్యాలు ఏమీ లేవు. ఎట్లా నివసించాలి?

- పద్మావతి, రాంజల రోడ్డు, ఆదోని

సాహితీ పరిశోధక రత్నం 'సురవరం'

క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్



ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్‌తో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ జగతిలో పరిశోధక రత్నంగా ప్రసిద్ధ సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి నిలిచిపోతారని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ కొనియాడారు. శనివారం నగరంలోని మద్దూరునగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశం హాలులో, సాహితీ సదస్సు - తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థల ఆధ్వర్యంలో, దివంగత వండుగ సుబ్బారెడ్డి స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. 'సురవరం ప్రతాపరెడ్డి గారి సాహిత్య సేవ' అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి విలువలతో కూడిన సంపాదకీయాలు, వ్యాసాలు రాశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సురవరం జీవిత చరిత్రపై సాహితీవేత్త తొగట సురేశ్ బాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, కన్వీనర్ డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఎం. లక్ష్మయ్య, మధురకవి ఎలమర్తి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భాషా, సాహితీ రంగాల పురోభివృద్ధికి కృషి చేయాలి

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా, సాహితీ రంగాల పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో, కర్నూలులోని భావనాప్రియ సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక పరిచయ సభలో ఆరు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యంపై మమకారం, ఆదరణ తగ్గిపోతున్న తరుణంలో ఆరుగురు రచయితలు పుస్తకాలు ముద్రించి ఒకే వేదికపై ఆవిష్కరించడం సంతోషదగ్గ పరిణామమని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్‌పై హర్షం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు, నిరుద్యోగులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు లాంటివని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌వీఆర్ కోచింగ్ సెంటరు ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీ నగర్‌లోని కోచింగ్ సెంటరులో సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు, ఎస్‌వీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, నిరుద్యోగులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఒక ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు 16,347 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్‌పై తొలి సంతకం చేశారని తెలిపారు. ఈ ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న ప్రభుత్వాన్ని ఎన్డీయే ప్రభుత్వం ఆక్సిజన్ ఇచ్చి ఆర్థిక పురోగతి వైపు నడిపిస్తుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు అహోరాత్రులు కృషి చేస్తున్నారనీ అన్నారు. అనంతరం శ్రీనివాసరెడ్డి, సురేష్, శ్రీనివాస్ ఫ్యాకల్టీ రచించిన గ్రూపు సంబంధించిన పుస్తకాలు గౌరు దంపతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, ఎస్‌వీఆర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఫ్యాకల్టీ నిరుద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ వాలీబాల్ పురుషుల జట్టు ఎంపిక



ఆర్‌యు వాలీబాల్ జట్టుతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలు ఈ నెల 18 నుంచి 22 వరకు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరగనున్నాయి. ఈ పోటీలలో రాయలసీమ యూనివర్సిటీ జట్టు పాల్గొంది. శనివారం క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ పాల్గొని క్రీడాదుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. కేరళ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాయలసీమ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం జట్టు వివరాలు ప్రకటించారు.

- కే. అభినయ్, పవన్‌కుమార్ (ఎస్‌ఆర్‌కేడీసీ, నంద్యాల),
- వాసు నాయక్, లక్ష్మీనారాయణ, బాలాజీ నాయక్ (ఆర్‌యు కాలేజీ, కర్నూలు)
- భార్గవ్ (కేజీఆర్ డిగ్రీ కాలేజీ, బనగానపల్లె), సూర్యతేజ (శ్రీసాయి కృష్ణ డిగ్రీ కాలేజీ, కర్నూలు), ఇస్మాయిల్, (శ్రీలక్ష్మి బీపీడీ కాలేజీ, కర్నూలు), ఈశ్వర్ నాయక్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ, కర్నూలు), పి. రాజేష్ (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, శ్రీశైలం), పరశురాం (ఉస్మానియా డిగ్రీ కాలేజీ, కర్నూలు), రమేష్ నాయుడు (ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, పత్తికొండ) ఉన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా. కేవీ శివకిషోర్, యూనివర్సిటీ బాలీబాల్ జట్టు మేనేజర్ ఇద్రుస్, కోచ్ రవి తదితరులు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప...



అలంకరణలో అయ్యప్పస్వామి విగ్రహం

భక్తిశ్రద్ధలతో విళక్కి పూజ

కర్నూలు కల్చరల్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అయ్యప్ప స్వామి విళక్కి పూజ ఆదివారం కన్నుల పండువగా సాగింది. వందలాదిగా అయ్యప్ప భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. నగరంలోని అయ్యప్ప దీప మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకలో కేరళలోని శబరిమలలో అయ్యప్ప స్వామికి నిర్వహించే పూజా కార్యక్రమాల లాగే ఈ వేడుకను నిర్వహించారు. నెహ్రూరోడ్డులోని పాత అయ్యప్ప స్వామి ఆలయం నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వరకు భక్తులు ర్యాలీ నిర్వహించారు. వేడుకలో భాగంగా కేరళకు చెందిన భక్తులు చేసిన డోలు, ఖడ్గ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అయ్యప్ప మాలధారులు మెట్ల పూజ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు దీపోత్సవ కమిటీ సభ్యులు వసతి ఏర్పాట్లు చేశారు.



గ్రామోత్సవం





అయ్యప్పస్వామి పడిపూజ

రమణీయం రథోత్సవం


భక్తులతో కిటకిటలాడిన దేవాలయం

ఆదోని రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం పాండవగల్లులో జరిగిన పాతూరు ఆంజనేయస్వామి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. శనివారం తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల నుంచి తెచ్చిన పూలను అలంకరించి ఆభరణాలతో స్వామివారిని ముస్తాబు చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

విద్యుత్‌ను ఆదా చేయండి

● ఎస్ఈ ఎం. ఉమాపతి


కరపత్రాలు విడుదల చేస్తున్న ఈఈ టి. శేషాద్రి

కల్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌ను ఆదా చేస్తే భావితరాలకు వెలుగు అవుతుందని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి శనివారం అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను జయప్రదం చేయాలని అధికారులను ఆదేశించారు. అవగాహన లేమి ఏమరపాటు ఫలితంగా అధికమవుతున్న విద్యుత్ వాడకం తద్వారా కరెంటు బిల్లులపై ప్రభావం పడుతుందని సూచించారు. రోజురోజుకూ అధికమవుతున్న విద్యుత్ వాడకం సగటున రోజుకు కర్నూలు జిల్లాలో 11.59 మిలియన్ యూనిట్ల వాడకం ఉండగా గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే అది 3 మిలియన్ యూనిట్ల వాడకం అధికమన్నారు. అందులో 7 నుంచి 8 శాతం విద్యుత్ వివిధ కారణాలతో వృథా చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు ఇంధన పొదుపు వారోత్సవాల్లో పాల్గొని అవగాహన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కర్నూలు టౌన్ డివిజన్‌లో ఈఈ టి.శేషాద్రి ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కరపత్రాలను విడుదల చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందికొట్కూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో గత వారం జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డ రాఘవేంద్ర (24) శనివారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 9వ తేదీన పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నగర్‌లోని ఓ ఇంట్లో జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే లహరి అనే యువతి మంటల్లో కాలిపోగా, ఇదే ఘటనలో తీవ్ర గాయాలపాలైన రాఘవేంద్రను వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆరు రోజులుగా మృత్యువుతో పోరాడిన యువకుడు శనివారం మృతి చెందినట్లు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నంద్యాల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వే స్టేషన్ లోని 2వ ప్లాట్‌ఫామ్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే పోలీసులు శనివారం తెలిపారు. జీఆర్‌పీఎస్ ఎస్సై ఎస్. అబ్దుల్ జలీల్ వివరాల మేరకు సుమారు 60 సంవత్సరాల వయసు కలిగిన వృద్ధుడి మృతదేహం నంద్యాల రైల్వే స్టేషన్‌లోని 2వ ప్లాట్‌ఫామ్‌పై గుర్తించామని అన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. మృతుడు తెలుపు రంగుపై ఎరుపు, నీలం లైన్స్ గల నిండు చేతుల చొక్కా, గీతల లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పక్కన లెదర్ చెప్పులు ఉన్నాయన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిసినవారు నంద్యాల రైల్వే పోలీసులను సంప్రదించాలని, 9440627653, 9490081633 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

ఆటో బస్సు ఢీ.. ఇద్దరికి గాయాలు

కోడుమూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలో శనివారం ఉదయం ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుడగజంగాల కాలనీకి చెందిన వేదవతి, ఉపేంద్ర అనే తల్లీకుమారులు ఆటోలో వంట సామగ్రి తీసుకుని పల్లెల్లో విక్రయించడానికి బయలుదేరారు. అయితే స్థానిక అరుణోదయ బుక్ సెంటర్ వద్ద బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తల్లికుమారులకు గాయాలు కావడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కాగా గాయపడిన వారిని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.

కూలీ ఆత్మహత్య


మృతి చెందిన చాకలి రంగప్ప

కోసిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి. బెళగల్ గ్రామానికి చెందిన చాకలి రంగప్ప (45) దినసరి కూలీ మద్యంలోకి పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివా రం జరిగింది. కొంత కాలంగా మద్యంకు బానిసై కుటుంబాన్ని పట్టించుకోని రంగప్ప ఆర్థిక పరిస్థితి దిగజారిపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా.. కుటుంబ సభ్యులు గుర్తించి కోసిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య పద్మ, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

కోసిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోసిగి, హాల్వి రోడ్డులో రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో డీ బెళగల్ గ్రామానికి చెందిన కుమ్మరి బజారికి కుడి కాలు విరిగిపోయి తీవ్ర గాయాలపాయ్యాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. డి. బెళగల్ గ్రామానికి చెందిన కుమ్మరి బజారి, నరసింహులు ఇద్దరు కలిసి హాల్వి నుంచి కోసిగికి బైక్‌పై వస్తుండగా కోసిగి నుంచి తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన మరో వ్యక్తి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. దుద్ది చెరువు సమీపంలో ఎదురెదురుగా వీరి బైకులు ఢీకొన్నాయి. బజారికి కాలు విరిగిపోయింది. వెంటనే 108 వాహనంలో కోసిగి ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పశుగ్రాసం దగ్ధం.. రూ.లక్ష నష్టం

ఓర్వకల్లు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నన్నూరు గ్రామానికి చెందిన రైతు లద్దగిరి రవి కల్లంలో ప్రమాదవశాత్తు శనివారం పశుగ్రాసం దగ్ధం కావడంతో రూ.లక్ష నష్టం వాటిల్లింది. మంటలను ఆర్పేందుకు ప్రజలు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఫైరింజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పశుగ్రాసం అంతా కాలి బూడిదైంది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గత ప్రభుత్వంలో రైతులు దగా

రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి బీసీ

బనగానపల్లె, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నదాతలను గత వైసీపీ ప్రభుత్వం దగా చేసి నట్టేట ముంచిందని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో బీసీ విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తూ వైసీపీ నాయకులు నిరసనలు చేపట్టి రోడ్లెక్కడం దారుణమన్నారు. రైతుల తరఫున వైసీపీ నాయకులు మాట్లాడడం సిగ్గు చేటన్నారు. గత 5 ఏళ్ళలో ప్రజాకంటకంగా వైసీపీ పాలన సాగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 6 నెలలకే వైసీపీ నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ రోడ్డెక్కడం విడ్డూరమన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక వైసీపీ పెట్టిన ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు చెల్లించి రైతుల కళ్లలో ఆనందం నింపిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. వరదల్లో పంట నష్టం రూ.2వేల నుంచి రూ.10 వేలు పెంచి 4లక్షల మంది రైతులకు రూ.601 కోట్లు నష్టపరిహారం చెల్లించామన్నారు. .తుపాన్, భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన కోస్తా, రాయలసీమ రైతులను ఆదుకుంటామన్నారు. రాష్ట్రంలో 85.46 మెట్రిక్ టన్నుల ధాన్యంఉత్పత్తి అవుతుంటే ఇప్పటికే 13.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 2.03లక్షల రైతులనుంచి సేకరించి48 గంటల్లోనే నష్టపరిహారం అందించినఘనత తమ ప్రభుత్వానిదన్నారు. తమ ప్రభుత్వం పంట ఉత్పాదకత ఉత్పత్తిపై దృష్టిపెట్టడంతో 15శాతం వృద్ధి రేటును సాధించినట్లు తెలిపారు. రైతులకు కేంద్రప్రభుత్వం అందించే బీమాపై అవగాహన కల్పించి ఈ బడ్జెట్‌లో 1023 కోట్లు కేటాయించామన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన రూములను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామ పంచాయితీ ఈవో సతీశ్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఈవోఆర్డీ సతీశ్‌రెడ్డి పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, గుల్లదుర్తి హరి, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడిని మీడియా ఎదుట హాజరు పరిచిన పోలీసులు

ఆత్మకూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో ఈ నెల 9న వెలుగు చూసిన చోరీ కేసుకు సంబంధించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం అర్బన్ సీఐ రాము నిందితుడ్ని మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదిలక్ష్మి స్వరాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈమె ఈ నెల 7న బెంగళూరుకు వెళ్లి 9వ తేదీన ఇంటికి తిరిగి వచ్చేలోగా ఇంటి తాళాలను పగలకొట్టి దొంగలు పడిన విషయాన్ని గుర్తించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అక్కడ లభించిన సీసీ కెమెరా ఫుటేజీలతో విచారణ చేపట్టారు. ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్‌కు చెందిన షేక్ ఖాదర్ బాషాను నిందితుడిగా గుర్తించి అతడిని ఇంట్లోనే అరెస్టు చేశారు. నిందితుని వద్ద నుంచి 3.75 తులాల బంగారు నగలు, 10తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1.45 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన ఆత్మకూరు అర్బన్ సీఐ రాము, ఎస్సైలు హుసేన్‌బాషా, వెంకటనారాయణ రెడ్డి తదితరులను ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ అభినందించారు.

పొలం కబ్జాకు యత్నం

గణేకల్లు వాసిపై కేసు నమోదు

ఆదోని రూరల్, డిసెంబరు 14, (ఆంధ్రజ్యోతి) : ఇతరులకు అమ్మిన పొలాన్ని తిరిగి కబ్జాకు ప్రయత్నించిన గణేకల్లు వాసి లోకానందపై పెద్దతుంబళం పోలీసులు కేసు నమోదు చేశారు. గణేకల్లు గ్రామానికి చెందిన లోకానంద 2015లో సర్వే నెం.214లో తన రెండెకరాల పొలాన్ని ఆదోనికి చెందిన కటికే రాజేష్‌కు విక్రయించాడు. అదే ఏడాదిలో రాజేష్ రాయచూరు జిల్లా అలసగేరి గ్రామంలో నివాసం ఉంటున్న ఆదోనికి చెందిన ఈడిగ సుమకు పొలాన్ని విక్రయించాడు. అయితే ఈడిగ సుమ ఆధీనంలో ఉన్న ఈ పొలాన్ని లోకానంద కబ్జా చేసుకోవాలని ప్రయత్నించాడు. సుమ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత.. ఇద్దరి అరెస్టు


ఆలూరులో కర్ణాటక మద్యం పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

ఆలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మరకట్టు గ్రామంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి వారిని నుంచి 288 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ లలితాదేవి, నవీన్ బాబు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హత్తిబెళగల్‌లో ఓ వ్యక్తిని అరెస్టు చేసి 672 కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నాటు సారా, కర్ణాటక మద్యం నియంత్రణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

బియ్యం లారీ బోల్తా

తుగ్గలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం నుంచి చెన్నైకి బియ్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్లకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. శనివారం తెల్లవారు జామున తుగ్గలి, గిరిగిట్ల వద్ద కేజీబీవీ పాఠశాల సమీపంలో వంక వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వంకలో పడిపోయింది. కొన్ని బియ్యం రోడ్డుపాలయ్యాయని, మరికొన్ని బియ్యం నీటిలో పడిపోయాయని లారీ డ్రైవర్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

మంత్రాలయం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. శనివారం అనారోగ్యంతో మధ్వమార్గ్ కారిడార్‌లో మృతి చెందినట్లు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి


మృతి చెందిన గిడ్డయ్య (ఫైల్)

ఆదోని రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై నుంచి పడి సచివాలయ ఉద్యోగి గిడ్డయ్య(32) మృత్యువాత పడ్డాడు. పత్తికొండ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన జయరాముడు, హనుమంతమ్మల చిన్న కొడుకు గిడ్డయ్యకు 2019లో సచివాలయ ఉద్యోగం రావడంతో ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు సచివాలయంలో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆదోని మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రాజేశ్వరిని గిడ్డయ్య వివాహం చేసుకున్నాడు. రాజేశ్వరి రెండు నెలల క్రితం నారాయణపురం లోని పుట్టింట్లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. శుక్రవారం విధులు ముగించు కొని ద్విచక్ర వాహనంపై భార్యా బిడ్డలను చూడడానికి బయల్దేరాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో నారాయణపురం క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో గిడ్డయ్య తీవ్రంగా గాయపడడంతో వాహనదారులు 108 వాహన సిబ్బంది సహాయంతో ఆదోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు

కోవెలకుంట్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి కారు నడుపుతున్న డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. తమిళనాడు నుంచి కోవెలకుంట్ల మీదుగా బనగానపల్లె వెళ్తున్న కారును కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తనిఖీ చేశారు. డ్రైవర్ మద్యం తాగి కారు నడుపుతున్నట్లు గుర్తించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలోని కొండపై నుంచి ఓ వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే కర్నూలు జిల్లా కల్లూరు మండలం దూపాడు గ్రామానికి చెందిన నాగరాజు కొండపై నుంచి పడి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. నాగరాజు ప్రతి పౌర్ణమికి అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వెళ్తుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటనపై ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

కపటిలో కుటుంబంపై దాడి

- సొంతపార్టీ నాయకుడిపై రెచ్చిపోయిన బీజేపీ నాయకులు
- మారణాయుధాలతో దాడులు
- భర్త పరిస్థితి విషమం.. భార్యా బిడ్డలకు తీవ్ర గాయాలు


ఈరన్నకు చికిత్స చేస్తున్న వైద్యుడు


గాయాలపాలైన బీజేపీ నాయకుడు ఈరన్న


గాయపడిన ఈరన్న భార్యా బిడ్డలు

ఆదోని/ఆదోని రూరల్, డిసెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): ఆదోని మండలం కపటి గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు బీభత్సం సృష్టించారు. ఓ కుటుం బంపై దాడి చేసి రచ్చరచ్చ చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండగా ఆయన భార్య, కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. వైసీపీలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులు కొన్ని రోజుల క్రితం బీజేపీలో చేరారు. అప్పటి నుంచి వీరి మధ్య వైరం కొనసాగుతూనే ఉంది. ఒక్కసారిగా శనివారం రాత్రి ఓ వర్గం కుటుంబంపై మరో వర్గం బీజేపీ నాయకులు కారం చల్లి గొడ్డళ్లు, కత్తులతో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఈరన్న, భార్య రాధమ్మ తెలిపిన వివరాల మేరకు రాత్రి 9గంటల సమయంలో గ్రామానికి చెందిన వెంకటేశులు, వెంకటస్వామి, రాజు, రవితోపాటు మరికొందరు ఇంటిపై దాడి చేసి కళ్లలో కారం చల్లి కత్తులు, కట్టెలతో దాడి చేశారన్నారు. చుట్టు పక్కల వారు గమనించి వారి దాడులను అడ్డుకోవడంతో తాము బతికి బయట పడ్డామన్నారు. ఇదిలా ఉండగా మరో వర్గానికి చెందిన వెంకటేష్ మాట్లాడుతూ... తాను బహిర్భూమికి వెళ్తుండగా ఈరన్న వెనుక నుంచి వచ్చి కట్టెలతో దాడి చేశాడని తెలిపాడు. దాడి ఘటన విషయం తెలుసుకున్న ఇస్వీ ఎస్ఐ సిబ్బందితో గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- రెండు కార్లు ఢీ - నలుగురికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గోనెగండ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని గాజులదిన్నె క్రాస్‌రోడ్డు దగ్గర శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఆదోని నుంచి రాయచోటి సుబ్బయ్య తన కుటుంసభ్యులు నలుగురితో కలసి తన కారులో కర్నూలు లో జరిగే వివాహకార్యాక్రమానికి బయలుదేరాడు. అలాగే ఎమ్మిగనూరు లో జరుగుతున్న అంతరాష్ట్ర క్రికెట్ పోటీలలో పాల్గొని ఆరు మంది క్రీడాకారులు ఎమ్మిగనూరు నుంచి కర్నూలు కు కారులో బయలుదేరారు. అయితే గాజులదిన్నె క్రాస్ రోడ్డు దగ్గర రహదారిలో పెద్ద గుంత ఉండటంతో గమనించిన రాయచోటి సుబ్బయ్య డ్రైవర్ కారు వేగాన్ని తగ్గించి దాటుతుండగా వెనకు వైపు నుంచి అతివేగంగా వచ్చి క్రీడాకారుల కారు ఢీకొంది. దీంతో రాయచోటి సబ్బయ్య కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో ముందరి కారులో ఉన్న ఇద్దరికి, వెనుక కారులో ఉన్న మరో ఇద్దరికి స్వల్పగాయాలు అయ్యాయి. ఇరువు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం

● టీడీపీ మద్దతుదారులు గెలుపు
● సంబరాలు చేసుకున్న టీడీపీ నాయకులు



సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఎమ్మెల్యేను కలిసిన ఉల్చాల టీడీపీ మద్దతుదారులు, నాయకులు

కర్నూలు రూరల్ డిసెంబరు14(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్, అర్బన్ మండలాలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ హవా కనిపించింది. రూరల్, అర్బన్ మండలంలోని అన్ని స్థానాలు టీడీపీ మద్దతుదారులు కైవాసం చేసుకుంది. మండలంలో మొత్తం 8స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా అందులో అధ్యక్షులు, ఉపాధ్యక్షుల పదవులను సభ్యులందరు కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానంగా రూరల్, అర్బన్ మండలాలు కలిపి నాలుగు చోట్ల ఎల్ఎల్సీ కింద సాగునీటి వినియోగదారులు సంఘం ఎన్నికలను అధికారులు నిర్వహించారు. అందులో ఉల్చాల, రేమట, జి.శింగవరం, మునగాలపాడు గ్రామాల రైతులు ఈఎన్నికల్లో పాల్గొన్నారు. ఉల్చాల, పూడూరు, మునగాలపాడులోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల కేంద్రం ఏర్పాటు చేయగా ఇందులో రైతులందరు ఒకే తాటిపై నిలిచి సభ్యులను ఎన్నుకున్నారు. టీడీపీ మద్దతుదారులైన ఎల్ఎల్సీ సాగునీటి సంఘం ప్రసిడెంట్, వైస్‌ప్రసిడెంట్‌లను ఎన్నుకున్నట్లు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. అలాగే కేసీ కెనాల్ కింద పూడూరు, జిశింగవరం, పడిదెంపాడు గ్రామాల రైతులు సాగునీటి సంఘం ఎన్నికల్లో పాల్గొని టీడీపీ మద్దతుదారులను ఎన్నుకున్నారు. చెరువుల కింద గార్గేయాపురం, తొలిశాపురం గ్రామాల్లో ఎన్నికలు జరిగగా టీడీపీ మద్దతుదారులు గెలవుపొందారు. కర్నూలు రూరల్, అర్బన్ మండలంలో ఉదయం 9గంటలకు సాగునీటి సంఘం ఎన్నికలు ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు కొనసాగినట్లు తహసీల్దార్ తెలిపారు. అనంతరం సాగునీటి సంఘం ఎన్నికల్లో గెలుపొందిన ప్రసిడెంట్, వైస్‌ప్రసిడెంట్, డైరెక్టర్లు మరియు టీడీపీ నాయకులు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డిని మద్యాద పూర్వకంగా కలిశారు.

కోడుమూరు రూరల్: మండలంలో జీడీపీ, ఎల్లెల్సీ సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. జీడీపీ కింద ఉన్న 2, 7, 10 ఎల్లెల్సీ పరిధిలో 43, 45, 46, 54 సాగునీటి సంఘాలన్నీ టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఆయా సంఘాల్లో టీసీ మెంబర్లు అధ్యక్ష, ఉపాధ్యక్షులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జీడీపీ కింద 2వ (కోడుమూరు) సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా మల్లికార్జునగౌడ్, ఉపాధ్యక్షుడిగా కొండన్న ఎన్నికయ్యారు. 7కు (ముడుమలగుర్తి) పురుషోత్తంరెడ్డి, బాలమ్మ 10కు (గోరంట్ల) పసుల రాధాక్రిష్ణ, బాలప్పను ఎన్నుకున్నారు. అలాగే ఎల్లెల్సీ కింద సాగునీటి సంఘాల్లో 43కు (పులకుర్తి) వెంకటేశ్, పెద్దయ్య 45కు (గోరంట్ల) కునున్నారు చంద్రశేఖర్, జానకిరామయ్య 46కు (లద్దగిరి) మేకల శంకర్, మీనుగ జనార్ధన్ 54కు ప్యాలకుర్తి నరసింహుడు, వెంకటరాముడులను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఎన్నికల సరళిని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పరిశీలించారు.

ఓర్వకల్లు: మండలంలోని శకునాల గ్రామంలో శనివారం తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో సాగునీటి సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. అయితే.. నామినేషన్లు టీడీపీ మద్దతుదారులు ఒకరే వేయడంతో సాగునీటి సంఘం ఎన్నిక ఏకగ్రీవమైంది. సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గణ శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఆకుల లక్ష్మయ్యతో పాటు సభ్యులు పుల్లయ్య, బీ.రాముడు, ఎం.రాముడు, వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులకు తహసీల్దార్ విద్యాసాగర్ డిక్లరేషన్ ఫారం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏఎస్ఐ శ్రీనివాసులుతో పాటు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, వీఆర్వోలు వెంకట్రావు, జనార్దన్, గ్రామ టీడీపీ నాయకులు మౌలీశ్వరరెడ్డి, హరి, సుబ్బయ్య, పుల్లయ్య, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలంలో నాలుగు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. శనివారం కల్లూరు మండలం పరిధిలోని పెద్దపాడు, ఉలిందకొండ, పర్ల, చిన్నటేకూరు సాగునీటి సంఘాలకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. నాలుగు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా సల్కాపురం పి.మౌలాలి, ఉపాధ్యక్షునిగా పందిపాడు కుర్వ.శేఖర్‌లకు ఎన్నికల అధికారి, కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. అదేవిధంగా ఉలిందకొండ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పి.రంగస్వామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శేఖర్, చిన్నటేకూరు సాగునీటి సంఘం అధ్యక్షునిగా కె. వగ్గు రాముడు, ఉపాధ్యక్షునిగా కమాల్‌బాషా, పర్ల సాగునీటి సంఘం అధ్యక్షురాలిగా బి.వనుమక్క, ఉపాధ్యక్షుడిగా గొట్టిపాటి.శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ 38వ వార్డు ఇన్‌చార్జ్ రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, సల్కాపురం దేవేంద్రారెడ్డి, ఉలిందకొండ ఈవీ.రమణ, పర్ల శేఖర్, శేషన్న, చిన్నటేకూరు మాజీ ఎంపిటీసీ రామాంజనేయులు, లక్ష్మన్న పాల్గొన్నారు.

సి. బెళగల్: మండలంలోని నాలుగు సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాతంగా ముగిశాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సిబెళగల్ మండల కేంద్రం 42, బ్రాహ్మణదొడ్డి 47, పోలకల్లు 48, కొండాపురం 49, గ్రామాల్లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. పోలింగ్ అధికారులు ఉదయభాస్కర్, గంగరాజు, వెంకటప్రకాశ్, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అధ్వర్యం నిర్వహించినట్లు తెలిపారు.

గూడూరు: గూడూరు మండలంలోని 5 సాగునీటి సంఘాలను టీడీపీ కైవసం చేసుకోంది. శనివారం గూడూరు మండలంలోని డబ్ల్యూయూఏ - 44 గూడూరు సాగునీటి సంఘం ఎన్నికల ప్రకియ జిల్లా పరిషత్ (బాలికల) నందు జరిగింది. మొత్తం 12 టీసీలు ఉండగా 11 టీసీలు టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. ఇందులో చైర్మన్‌గా సింగనగేరి నాయుడు, వైస్ చైర్మన్‌గా మునెప్ప ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. అలాగే డబ్ల్యూయూఏ - 50 ఆర్ కానాపురం సాగునీటి సంఘం ఎన్నికల పక్రియ జిల్లా పరిషత్(బాలురు)నందు జరిగింది. మొత్తం 12 టీసీలు ఉండగా 12 టీసీలు టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోన్నారు. ఇందులో చైర్మన్‌గా కె మహేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్‌గా కె లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డబ్ల్యూయూఏ తిమ్మాపురం చెరువు ఆర్ ఖానాపురం సాగునీటి సంఘంకు సంబంధించి 6 టీసీలు ఉండగా అన్నింటిని టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోన్నారు. ఇందులో చైర్మన్‌గా బోయ రామచంద్రుడు, వైస్ చైర్మన్‌గా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డబ్ల్యూయూఏ యంఐ ట్యాంక్ కత్వవాగు చెరువుకు సాగునీటి సంఘంకు సంబంధించి 6 టీసీలు ఉండగా అన్నింటిని టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోంది. చైర్మన్‌గా కె హనుమన్న, వైస్ చైర్మన్‌గా కోటకొండ రాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే డబ్ల్యూయూఏ - 55 కె నాగలాపురం సాగునీటి సంఘంకు సంబంధించి 12 టీసీలు ఉండగా అన్నింటిని టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో చైర్మన్‌గా ఏ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్‌గా జనార్ధన్ రెడ్డి ఎకగ్రీవంగా ఎన్నిక కాగ వీరందరకి ఎన్నికల అధికారులు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

రైతుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం: రైతుల సంక్షేమమే తెలుగుదేశం, కూటమి ప్రభుత్వ ధ్యేయమని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. శనవారం గూడూరులో సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు 5 సాగునీటి సంఘాలను కైవసం చేసుకోవడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలను జరుపుకోన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేమట వెంకటేశ్వర్లు, సృజన్, పౌలు, జె సురేష్, కె కృష్ణ, కోడుమూరు షాషావళి, పుట్టపాశం రామాంజనేయులు, కె విజయకుమార్, కూరగాయల చాంద్ బాష, సురేష్, మల్లేష్ నాయుడు, మునగాల కుంటిచేతి గోపాల్, హనుమన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.



శకునాలలో సాగునీటి సంఘం అధ్యక్షుడు గణ శ్యాంసుందర్ రెడ్డికి డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్



లద్దగిరి సాగునీటి సంఘానికి ఎన్నికైన సభ్యులు



పెద్దపాడు సాగునీటి సంఘానికి ఎన్నికైన సభ్యులు



గూడూరులో సాగునీటి సంఘంలో గెలిచిన చైర్మన్, వైస్ చైర్మన్, టీసీలతో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



సీ. బెళగల్: ఎన్నికైన వారికి డిక్లరేషన్ ఫారాలు అందజేస్తు అధికారి

ఆరో రోజు కార్మికుల సమ్మె

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిదిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు జీతాలు పెంచాలని చేస్తున్న సమ్మె శనివారానికి ఆరవరోజుకి చేరింది. నగర పాలక కార్యాలయం ఎదుట టెంట్ ఏర్పాటు చేసుకుని దీక్షలు చేపట్టారు. ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జి.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, కాశపోగు జ్ఞానమ్మ, జి. వెంకటేష్, జావీద్ పాల్గొన్నారు.

మాలల మహా గర్జనను జయప్రదం చేయండి



అంబేడ్కర్ భవన్‌లో పోస్టర్ల విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో 15న జరిగే మాలల మహాగర్జనను జయప్రదం చేయాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్సీఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మహాగర్జనకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, నాగేంద్ర, సత్యనారాయణ, పసుపుల నాగేంద్ర, కే.రాజన్న పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే మార్షల్ ఆర్ట్స్ అవసరం



కరాటేలో షీల్డ్స్ అందుకున్న చిన్నారులతో డాక్టర్ శంకర్‌శర్మ, శిక్షకుడు శ్రీనివాసులు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో ఆత్మరక్షణతో పాటు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఎంతో ఉపయోగకరమని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ అన్నారు. శనివారం స్థానిక కింగ్‌మార్కెట్ వద్ద ఉన్న మున్సిపల్ హై స్కూల్ పార్కులో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఉషూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు షీల్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

జగన్ నీ డ్రామాలు ఆపు : టీడీపీ



మాట్లాడుతున్న ధరూర్ జేమ్స్

కర్నూల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న సమయంలో రైతన్నలను అనేక కష్టాలకు గురి చేసిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు నేడు రైతన్న పేరుతో వారి ఉనికిని చాటుకోవడం కోసం ధర్నాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని, ఇక మీ డ్రామాల ఆపాలని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, డా.బీఆర్ అంబేడ్కర్ దళిత నిరుపేద సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ధరూర్ జేమ్స్ అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ఇళ్ల పట్టాల పేరుతో అసైన్డ్ భూములు చట్టానికి విరుధంగా నిరుపేద రైతుల భూములను బలవంతంగా లాగేసుకుని రైతన్నల కడుపు కొట్టిన జగన్ రెడ్డి, ఆ పార్టీ నాయకులకు నేడు రైతన్న గుర్తుకు రావడం విడ్డూరమన్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, జడ్పీచైర్మను, ఇద్దరు మంత్రులు ఉండి జిల్లాలో ఆర్డీఎస్ రైట్ కెనాల్, ఎ ల్లెల్సీ, గుండ్రేవుల వేదవతి వంటి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నాడు-నేడు అంటూ ప్రగల్భాలు పలికిన జగన్‌రెడ్డి నేడు కూటమి ప్రభుత్వ హయాంలో రైతన్న స్థితిగతుల పై మీడియా సముఖంగా బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీ వ్యవస్థను సమన్వయంతో నిర్వహించాలి

● కమిషనర్ రవీంద్రబాబు



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర పాలక ఆయా విభాగాల అధికారులు, డ్రైనేజీ వ్యవస్థను సమన్వయంతో నిర్వహించాలని తద్వారా సంతృప్తికరమైన సత్ఫలితాలు పొందవచ్చుని నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు అన్నారు. శనివారం ఉల్చాల రహదారిలోని నాగేంద్రనగర్, సిద్ధార్థ, అపూర్వ హోమ్స్, వై. జంక్షన్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. పలు కాలనీల్లో మురుగు కాలువలకు ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్యధికారి డా.కే. విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ క్రిష్ణలత, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, ఏఈ భానుప్రతాప్ పాల్గొన్నారు.

'పదోన్నతుల్లో అన్యాయం'

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్స్, డైట్ లెక్చరర్స్ ఎంఈవో, ఉపవిద్యాశాఖ అధికారులు, విద్యాశాఖ అధికారుల పదోన్నతుల్లో అన్యాయానికి గురవుతున్నారని ఆత్మగౌరవ సాధన సమితి నాయకులు ఓంకార్ యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ఎంపీపీ హాలులో ప్రధానోపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ విద్యాశాఖలో 95 శాతం మంది పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు ఉన్నత అర్హతలు, సర్వీసు ఉన్నప్పటికీ వారికి ఎటువంటి పదోన్నతి లేకుండా దీర్ఘకాలంగా పని చేస్తూ అదే క్యాడర్‌లో పదవీ విరమణ పొందుతున్నారన్నారు. అతి తక్కువ సంఖ్యలో ఉన్న ప్రభుత్వ మేనేజ్మెంట్ ఉపాధ్యాయులకు తక్కువ సర్వీసు ఉన్నప్పటికీ ఉన్నత పదవులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని వివరించారు. ఈ విషయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ప్రధానోపాధ్యాయులు గోవిందరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు గోకారి, జనార్ధన్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, ఏపీటీఎఫ్ (257) అధ్యక్షులు రంగన్న, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు రత్నంఏసేపు, పీడీ అసోసియేషన్ డైరెక్టర్ లక్ష్మయ్య, ఆర్‌యుపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ శర్మ ఏపీటీఎఫ్ నాయకులు ఇస్మాయిలు, మరియానందం పాల్గొన్నారు.



ఆత్మగౌరవ సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన తెలియజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

ప్రముఖ గుండె వైద్యుడికి మాతృవియోగం



మాతృమూర్తి పాడె మోస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, రఘురాం

కోడుమూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో కార్డియాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ మాతృమూర్తి సావిత్రమ్మ (86) శనివారం వేకువజామున మృతి చెందారు. ప్యాలకుర్తి గ్రామానికి చెందిన టీచర్ లక్ష్మణదాసుయాదవ్, సావిత్రమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. గ్రామాభివృద్ధికి సావిత్రమ్మ కృషి చేశారని గ్రామస్తులు కొనియాడారు.

గౌరు దంపతులకు సన్మానం



గౌరు దంపతులను పూలదండలతో సన్మానిస్తున్న పందిపాడు టీడీపీ నాయకులు

కల్లూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు గౌరు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదలు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో పూలదండలు, బొకేలు, శాలువాలతో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి లను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిచిన వారు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పార్టీ నిర్ణయాలను పాటించి క్రమశిక్షణగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పందిపాడు శేఖర్‌చౌదరి, కురపాటి దేవేంద్రారెడ్డి, పెద్దపాడు సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పింజరి మౌలాలి, కుర్వ.శేఖర్, ఏ.గోకులపాడు టీడీపీ నాయకులు మాజీ సర్పంచు లక్ష్మీవరదారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ప్రశాంతత అవసరం'



మాట్లాడుతున్న మహరాజ్ సదానందగిరి స్వామీజీ

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రశాంతత అవసరమని మహరాజ్ సదానందగిరి స్వామీజీ అన్నారు. స్థానిక రవీంద్ర ఇంజనీరింగ్ మహిళా కళాశాలలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, మెలకువలు ఎలా సంపాదించుకోవాలో క్షుణ్ణంగా వివరించారు. ధ్యానం, యోగా ద్వారా ఆత్మస్థైర్యంతో విద్యలో సాధికారత సంపాదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక పిరమిడ్ బ్రహ్మర్షి, బీవీరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 176 కేసులు పరిష్కారం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో నగర పాలక రెవెన్యూ విభాగానికి సంబంధించి 176 కేసులు పరిష్కారమయ్యాయి. వివిధ పన్నులకు సంబంధించి వాణిజ్య దుకాణాలకు నగర పాలక అధికారులు గత నెల 20వ తేదీ నుంచి 14 వరకు మొత్తం 1459 నోటీసులు జారీ చేయగా.. వాటిలో 176 కేసులకు శనివారం జిల్లా కోర్టు ఆవరణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌తో పరిష్కారం లభించాయి. కార్యక్రమంలో ఆర్వోలు ఇజ్రాయేలు, జునైద్, ఆర్ఐలు, ప్రత్యేక అధికారులు, అడ్మిన్‌లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శనివారం సర్వే.నెంబర్ 62లో అబ్దుల్ వహాబ్ ఖాన్ టాంబ్‌కు చెందిన వక్ఫ్ భూమిపై జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్.పర్వీన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సయ్యద్ సొహైల్ నిలిపివేశారు. వారు మాట్లాడుతూ నగరంలో వక్ఫ్‌బోర్డు భూమిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రేమతత్వమే క్రీస్తు సందేశం




కేక్ కట్ చేస్తున్న కమిషనర్ దంపతులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రేమతత్వమే క్రీస్తు సందేశమని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు కమిషనర్ కుటుంబసమేతంగా హాజరయ్యారు. ముందుగా సిలోహం చర్చి పాస్టర్ అష్కనాజ్ వాఖ్య సందేశమివ్వడంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్యాండిల్స్ వెలగించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా.కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓలు ఇజ్రాయేలు, జునైద్, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఈఈ శేషసాయి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తజయంతి వేడుకలు

● సాయిబాబా ఆలయంల్లో ప్రత్యేక పూజలు ● అన్నదాన కార్యక్రమాలు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) : దత్తజయంతి వేడుకలను నగరంలోని భక్తులు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నగరంలో వివిధ ప్రాంతాల్లో వెలసిన షిరడీ సాయిబాబా దేవాలయాల్లో బాబావారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతనగరంలో దక్షిణ షిరిడీగా వినతికెక్కిన షిరిడీ సాయిబాబా దేవస్థానంలో జరిగిన దత్తజయంతి వేడుకల్లో భక్తులు హాజరయ్యారు. బాబావారికి ధుని పూజ, సాయి సత్యవ్రతం, మధ్యాహ్న హారతి ఇచ్చారు. సాయంత్రం ధూప్ హారతి, రాత్రి పల్లకి సేవ, శేజ్ హారతి పట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని సరస్వతినగర్‌లోగల శివదత్త సాయిమందిరంలో దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకాలు భక్తులచే నిర్వహింపజేశారు. అనంతరం బాబా వారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు, మధ్యాహ్నం హారతి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం హారతి, పల్లకి సేవ నిర్వహించారు. సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో దత్తజయంతి సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటరమణ కాలనీలోని సత్యసాయి మందిరం, అశోక్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి, ద్వారకామాయి సాయిమందిరంలో దత్త జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేసీ కెనాల్ వినాయక ఘాట్ సమీపంలోని వినాయక మందిరంలోగల సత్యసాయి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఎ.క్యాంపులోని ఆదిత్యనగర్‌లోని సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరంలో గురు దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని నాగసాయి దేవాలయంలో దత్తాత్రేయ జయంతిని వైభవంగా నిర్వహించారు.



అశోక్‌నగర్‌లో మహిళల ప్రత్యేక పూజలు

కర్నూలు నగరంలో సాయిసాబాకు పూజలు చేస్తున్న మహిళలు

వెంకటరమణ కాలనీ సాయిమందిరంలో ప్రత్యేక అలకరణలో సాయిబాబా

మున్సిపల్ కార్మికుల నిరసన



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆదోని టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులు అహమ్మద్, పీరా, సోమన్న మాట్లాడుతూ పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, టెక్నికల్ వారికి రూ.29,200, నాన్‌టెక్నికల్ వారికి రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లకు పైగా సర్వీస్ ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని, కార్మికులకు బీమా వర్తింపజేయాలని అన్నారు. ప్రభుత్వం కనీస డిమాండ్లను అంగీకరించే వరకు పోరాటల కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, కర్రెన్న, కైలాష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఆదోని టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూ శ్మశానంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి సభ్యులు కన్నె జగదీష్, ఎండీ బసవ రాజస్వామి, గాజుల చంద్రశేఖర్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ శ్మశాన వాటిక ప్రాంగణంలో ముళ్ల కంపలు పెరిగిపోయాయని అన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కోరారు.

క్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్



కేక్ కట్ చేస్తున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏసుక్రీస్తును ఆరాధించడమే నిజమైన క్రిస్మస్ అని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ దైవవర్తమానికులు రిటైర్డ్ ఆర్‌ఐవో రామసుబ్బన్న అన్నారు. శుక్రవారం రాత్రి ఆదోని పట్టణలోని జేబీ గార్డెన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య ప్రసంగీకుడిగా ఆర్‌ఐవో రామ సుబ్బన్న అతిథులుగా డీఈవో శ్యామ్యూల్ పాల్, ఇంటర్నేషనల్ డ్యామ్ ఎక్స్పర్ట్ తారాపురం సుదాకర్, డీఎస్పీ సోమన్న, టూ టౌన్ సీఐ సూర్య మోహన్‌రావు, డీసీడీవో స్నేహలత హాజరయ్యారు. క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలియజేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ ఉద్యోగులు వృత్తి నిపుణులు లుర్దయా, సుధాకర్, న్యూటన్ రాజు, సునీల్ రాజ్ కుమార్, సంగతి దేవదానం, అదిమూర్తి , చిన్న, మధు, చెన్నయ్య, అమర్నాథన్ పాల్గొన్నారు.

సత్వర పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయం

పత్తికొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్వర కేసుల పరిష్కారమే లోక్ అదాలత్ ధ్యేయమని జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేద్కర్ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఇరువర్గాల కక్షిదారులను విచారించి 35 కేసులను పరిష్కరించినట్లు క్లర్క్ రాఘవేంద్ర తెలిపారు. ఇందులో 29 ఐపీసీ క్రిమినల్ కేసులు, నాలుగు సివిల్ కేసులు, ఒక భరణం కేసు, ఒకటి గృహహింస కేసులను పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మహేష్, న్యాయవాదులు సురేష్ కుమార్, సత్యనారాయణ, మైరాముడు, మల్లికార్జున, నరసింహయ్య, దామోదరాచారి, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

248 కేసుల పరిష్కారం

ఆలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆలూరు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌లో జడ్జి జ్యోతి 248 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలు పడి విలువైన సమయం వృథా చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఏపీపీ కృష్ణ కిషోర్ న్యాయవాదులు లక్ష్మీకాంత్. వాయుజోత్తమరావు. ప్రవీణ్ కుమార్, మాధవకృష్ణ, విజయ రాజు, షేక్షావలి పాల్గొన్నారు.

ఘనంగా సాయి బాబా విగ్రహం ఊరేగింపు

ఆలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు పట్టణంలో వెలసిన షిర్డీ సాయిబాబ మందిరంలో ఈ నెల 15న ఆదివారం జరిగే గురు పౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం నగర భిక్ష కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని పురవీధులగుండా వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, రామునాథ్ రెడ్డి మల్లికార్జున, సిద్దలింగయ్య స్వామి, సురేందర్, నాగేంద్రశెట్టి పాల్గొన్నారు.

మునిరంగస్వామి ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మునిరంగస్వామి, తిమ్మ గురుడు స్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయని ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు. శనివారం లింగనాయునదొడ్డి సమీపంలో గౌతమ మహాముని కొండల్లో వెలసిన మునిరంగస్వామి, తిమ్మగురుడు స్వాములకుపీఠాధిపతి పక్కీరప్పస్వామి పూజలు చేశారు.

రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు

మద్దికెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలిలో వెలసిన రంగనాథ స్వామి దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామికి ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అనంతరం వీధుల గుండా పల్లకి ఊరేగింపు నిర్వహించారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి

మద్దికెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయినగర్ కాలనీలో వెలసిన షిరిడీ సాయిబాబా దేవాలయంలో దత్తాత్రేయ జయంతి వైభవంగా జరిగాయి. ముందుగా మూలవిరాట్ షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలు పల్లకిలో ఊరేగించారు.

పెరవలిలో ఉరుసు

మద్దికెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలిలో కులమతాలకు అతీతంగా వెలిసిన షేక్ హజరత్ హసన్ వలి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం దర్గా నిర్వహకులు ముల్లా హుశే న్‌సాహెబ్, హసన్‌వలి 66వ ఉరుసు ఉత్సవాలు పురస్కరించుకుని దర్గాను అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



పెద్దహరివాణం గ్రామంలో ఎల్లెల్సీ చైర్మన్, వైస్ చైర్మన్లతో రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు



చిప్పగిరి సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చెరుకూరి ధనుంజయ, టీసీ సభ్యులతో వీరభద్రగౌడ్, ఆయకట్టు రైతులు

సాగునీటి ఎన్నికలు ఏకగ్రీవం



కంబాలపాడు చెరువు సాగు నీటి సంఘం చైర్మన్‌గా ఎన్నికై డిక్లరేషన్‌ఫాం అందుకుంటున్న కేఈ రమాదేవి



మద్దికెర: సాగు నీటి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని/ఆదోని రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదోని నియోజకవర్గంలో సాగు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప సాగు నీటి సంఘాలు జరిగే గ్రామాల్లో పర్యటించి దాదాపు అన్ని గ్రామాల నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పట్టు నిలుపుకున్నారు. ఆదోని నియోజకవర్గంలో ఎల్లెల్సీ-2 మైనర్ ఇరిగేషన్-4 నీటి సంఘాలకు గాను అన్నింటిని కూటమి అభ్యర్థులు ఏకగ్రీవం చేసుకున్నారు. చిన్న హరివాణం టీసీకి మాత్రమే ఎన్నికలు జరిగాయి. మిగతా అన్ని చోట్ల ఏకగ్రీవమయ్యాయి. తుంగభద్రలో లెవెల్ కెనాల్‌కు సంబంధించిన డబ్ల్యుయూఏ-6 పెద్దహరివాణం ఎల్ఎల్‌సీ సాగునీటి సంఘం చైర్మన్‌గా టీడీపీకి చెందిన గురులింగప్ప, వైస్ చైర్మన్‌గా వీరనాగప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డబ్ల్యుయూఏ-7 సంతేకూళ్లూరు ఎల్లెల్సీ సాగు నీటి సంఘం చైర్మన్‌గా టీడీపీకి చెందిన బసాపురం రామస్వామిని, వైస్ చైర్మన్‌గా బీజేపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాలుగు చెరువులకు సంబంధించిన సాగు నీటి సంఘాల ఎన్నికలకుగాను అన్నింటిలో కూటమి కైవసం చేసుకున్నాయి. పెద్దహరివాణం సాగు నీటి సంఘానికి టీడీపీ చెందిన చైర్మన్‌గా హుసేనప్ప, వైస్ చైర్మన్‌గా రంగస్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇస్వి గ్రామ సాగు నీటి సంఘానికి టీడీపీకి చెందిన విరుపాక్షిరెడ్డి చైర్మన్‌గా, దాదావలి వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవమయ్యారు. నగరూరు దాణాపురం సాగు నీటి సంఘానికి జనసేనకు చెందిన శవరాజ్ కుమార్ చైర్మన్‌గా, టీడీపీకి చెందిన వీరభద్ర గౌడ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగనాతనహళ్లి గ్రామ సాగు నీటి సంఘానికి టీడీపీ చెందిన శ్రీనివాస్ రెడ్డి చైర్మన్‌గా వైసీపీకి చెందిన చాకలి జగన్నాథ్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నాగనాతనహళ్లి గ్రామంలో మాత్రమే వైసీపీకి చెందిన జగన్నాథ్ వైస్ చైర్మన్ పదవి దక్కించుకున్నారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్లకు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులకు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు. సాగు నీటి సంఘాల ఎన్నికల్లో ఏపీ రాష్ట్ర కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నేత ఉమాపతి నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠలు అన్ని చోట్ల కలిసి తిరిగారు.

ఆస్పరి: మండలంలోని వెంగలాయిదొడ్డి, ముత్తుకూరు, చిన్నహోతూరు ఇరిగేషన్ చెరువులకు శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వెంగలాయిదొడ్డి సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బసవరాజు, ముత్తుకూరు, చిన్నహోతూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శివశంకర్ నాయక్ ఎన్నికైన అధ్యక్షులకు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.

హలహర్వి: మండలంలోని సాగునీటి సంఘం ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చింతకుంట చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ చౌదరి, కామినహాల్ చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు, బిలేహాల్ చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు చంద్రన్న రెడ్డిలను టీసీ మెంబర్లంతా ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటర్ జె.హోసళ్లి సాగునీటి సంఘం అధ్యక్షులుగా కరువ మల్లన్న, బల్లూరు సాగు నీటి సంఘం అధ్యక్షులుగా వణికేరప్ప, అర్దగేరి హెచ్చెల్సీ సాగునీటి సంఘం అధ్యక్షులుగా హరినాథ్ రెడ్డి, మల్లికార్జున పల్లి సాగునీటి సంఘం అధ్యక్షులుగా కిష్టప్పలను ఎన్నికైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. ఎన్నికైన అభ్యర్థులంతా టీడీపీకి చెందిన వారు కావడంతో మరోసారి కార్యకర్తల సందడి నెలకొంది. ఎస్ఐ చంద్ర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రిష్ణగిరి: మండలంలో జరిగిన సాగు నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా, ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జరిగిన ఎన్నికల్లో కంబాలపాడు చెరువు సాగు నీటి సంఘం చైర్మన్‌గా కేఈ రమాదేవి, పెనుమాడ చెరువు సాగు నీటి సంఘం చైర్మన్‌గా కృష్ణమూర్తి, కూర్మగిరి, బోయనాల, చౌడమ్మ చెరువు, హంద్రీనీవా కాలువ లక్కసాగరం, చిట్యాల, గాజులదిన్నె ప్రాజెక్ట్ కాలువ పోతుగల్లు, మన్నెకుంట, ఎస్‌హెచ్.ఎర్రగుడి, తొగర్చేడు టీసీలుగా తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్ఐ మల్లికార్జున బందోబస్తు నిర్వహించారు.

మద్దికెర: మండలంలోని బసినేపల్లిలోని లింగాలవాగు డ్యాం నీటి సంఘం చైర్మన్‌గా గ్రామానికి చెందిన టి.మునిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండలంలోని బసినేపల్లి సచివాలయంలో ఎన్నికల అధికారి యు.రవి, తహసీల్దార్ హుశేన్ సాహెబ్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరగ్గా.. ఉదయం తెలుగుదేశం పార్టీ మద్దతుదారులైన మునిరెడ్డి, దాసరి నాగరాజు, ఆదినారాయణ, రామాంజనమ్మ, యూసుఫ్, లింగమ్మలు మొత్తం ఆరుగురు పోటీ చేశారు. అయితే.. వైసీపీ వారు ఇతరులు గానీ పోటీ చేయకపోవడంతో టీడీపీ మద్దతుదారులు ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక జరిగింది. చైర్మన్‌గా మునిరెడ్డిని, వైస్ చైర్మన్‌గా ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

తుగ్గలి: సాగునీటి సంఘం అధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శనివారం తహసీల్దార్ రమాదేవి, ఇరిగేషన్ ఏఈ ధర్మేంద్ర, ఎంపీడీవో విశ్వమోహన్ ఆధ్వర్యంలో జొన్నగిరి, పగిడిరాయి, చెన్నంపల్లి, బొందిమడుగులలో సాగునీటి సంఘం అధ్యక్షులను టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జొన్నగిరి నీటి సంఘం అధ్యక్షుడుగా గుంతా రంగస్వామి, పగిడిరాయి నీటి సంఘం అధ్యక్షులుగా విష్ణువర్ధన్ రెడ్డి, చెన్నంపల్లి అధ్యక్షునిగా గోపాల్‌రెడ్డి, బొందిమడుగుల నీటి సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని టీడీపీ నాయకులు పూలమాలలతో సన్మానించారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, విజయ శేఖర్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దుర్తి: మండలంలోని ఆరు సాగు నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వెల్దుర్తి వీరన్నగట్టు చెరువు చిన్నగోపాల్‌గౌడు, కాంథాన్ చెరువు కిట్టు, నరసాపురం చెరువు వెంకటేశ్వర్లు గౌడు, లక్ష్మీనగరం నర్సప్ప చెరువు మురళీధర్ రెడ్డి, గోవర్ధనగిరి చెరువు రామకృష్ణారెడ్డి, సూదేపల్లె చెరువుకు మద్దయ్య ఏకగ్రీవమయ్యారు.

దేవనకొండ: నేలతలమరి, కరివేముల, మాచాపురం సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మూడు గ్రామాల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేలతలమరి చైర్మన్‌గా చాకలి మాదన్న, వైస్ చైర్మన్‌గా ఈడిగ రంగస్వామి, కరివేములలో చైర్మన్‌గా అబ్బా రంగన్న, వైస్ చైర్మన్‌గా బడిగింజల చిన్న వీరన్న, మాచాపురంలో మారందొడ్డి వెంకన్న, వైస్ చైర్మన్‌గా కురువ ఊరువాకిలి లక్ష్మన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేలతలమరిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీమోహన్, మాచాపురంలో పీఆర్‌ఏఈ సోమన్న, కరివేములలో ఏఓ మునెమ్మలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

చిప్పగిరి: నీటి సంఘల అధ్యక్షుల పదవులను అధికార కూటమి రైతులు కైవసం చేసుకున్నారు. చిప్పగిరి, హాలహర్వి, ఆలూరు మండలాల పరిధిలో చిప్పగిరి సాగునీటి సంఘం అధ్యక్షుడుగా చెరుకూరు ధనుంజయ, రామదుర్గం బెల్లంకొండ రామచంద్ర, మీసాల రామాంజనేయులు, హత్తి బెళగల్ నగర డోన కిష్టప్ప, అద్దిగేర హరినాథ్ రెడ్డి, చింతకుంట రాజీవ్ సాగునీటి సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఆరుగురిలో ఒకరిని ఈనెల 17వ తేదీన ఏబీసీ డిస్ట్రిబ్యూటర్ కమిటీ అధ్యక్షున్ని ఎన్నుకుంటారు. కార్యక్రమంలో ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, జడ్పీటీసీ రాష్ట్ర సంఘం మాజీ అధ్యక్షుడు ఏరూరు మీనాక్షి నాయుడు పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలోని సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా శనివారం ముగిశాయి. హొళగుందలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎల్లెల్సీకి సంబంధించిన డబ్ల్యూయూఏ-4 అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు మిక్కిలిని శివప్రసాద్, డబ్ల్యుయూఏ-3 అధ్యక్షుడిగా ఉస్మాన్ సాబ్, గజ్జెహళ్లి గ్రామానికి సంబంధించిన డబ్ల్యుయూఏ-అధ్యక్షుడిగా పెద్ద ఎర్రిస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హెబ్బటం మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన పెద్ద వంక, తెల్ల వంక చెరువులకు సంబంధించిన ఎన్నికలు సాయంత్రమైనా జరగలేదు.

ఆలూరు రూరల్: మండల పరిధిలోని హత్తిబెళగల్ చెరువు చైర్మన్‌గా దాసరి ఈరప్ప, వైస్ చైర్మన్ పి రంగప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఆదిఆంధ్ర పాఠశాలలో జరిగిన ఎన్నికలు జరిగాయి. ఎవరు పోటీ చేయకపోవడంతో సభ్యుల మద్దతుతో టీడీపీకి చెందిన దాసరి ఈరప్ప చెరువు చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పణి కుమార్ తెలిపారు. ఈరప్పను టీడీపీ నాయకులు కోనకొండ్ల నాగరాజు, ఈరన్న, పెద్దహ్యాట నాగరాజు, శేఖన్న, చంద్ర ధర్మప్పలు ఘనంగా సన్మానించారు.

ఆలూరు: ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 6 డబ్ల్యుయూసీ స్థానాలకు శనివారం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన టీడీపీ మద్దతుదారులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో అన్ని స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. అందులో చిప్పగిరి సాగు నీటి వినియోగదారులు సంఘం అధ్యక్షుడుగా చిప్పగిరి ధనుంజయ్ చింతకుంట అధ్యక్షులుగా సత్యనారాయణ చౌదరి రామదుర్గ అధ్యక్షులుగా రామచంద్ర హత్తిబెళగల్ అధ్యక్షులుగా కిష్టప్ప డేగలహాల్ అధ్యక్షులుగా మీసాల ఆంజనేయులు, అర్ధగేరి అధ్యక్షులుగా హరినాథ్ రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.. అలాగే అగ్రహారం మైనర్ సాగు నీటి సంఘం అధ్యక్షులుగా దాసరి ఈరప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే హొళగుంద మండలంలో మొత్తం 5లో 3 ఎల్లెల్సీ సాగు నీటి సంఘాలను టీడీపీ మదతు దారులు ఏకగ్రీవం అయ్యారు. రెండు మైనర్ చెరువలను కూడా టీడీపీ మద్దతు దారులు ఏకగీ్రవంగా ఎన్నికయ్యారు.

● వెంగాలయ దొడ్డి, ముత్తుకూరు, చిన్న హోతూరు ఇరిగేషన్ చెరువులను టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. దేవనకొండ మండలంలో మాచాపురం, కరివేముల, నేతతలమర్రి మైనర్ చెరువుల సాగు నీటి సంఘం అధ్యక్షులుగా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం అయ్యారు. మొత్తం ఆలూరు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాల్లో 22సాగు నీటి సంఘం అధ్యక్ష పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. చిప్పగిరి మండలంలో ఏకగ్రీవాలకు మాజీ జడ్పీటీసీ సభ్యులు మీనాక్షి నాయుడు కృషి చేసి పట్టు నిలుపుకున్నారు. మరోవైపు వీరభద్ర గౌడ్ సూచనల మేరకు టీడీపీ సీనియర్ నేతలు రఘు ప్రసాద్ రెడ్డి, అట్టేకల్ జగన్ మోహన్ బాబు, కామినేహాళ్ రమేష్, గిరి మల్లేష్ గౌడ్ ఏకగ్రీవం చేయడంలో ఎత్తులుపై ఎత్తులు వేసి సఫలీకృతులయ్యారు.

● సాగు నీటి సంఘం ఎన్నికల విషయంపై ఎమ్మెల్యే విరుపాక్షి పిలిస్తే వెళ్లానే తప్ప తాను పార్టీ మారలేదని టీడీపీ సీనియర్ నేత ఎరూర్ మహేష్ శనివారం అన్నారు. తమది ఆలూరు నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా టీడీపీకి సేవలందిస్తున్న కుటుంబం అన్నారు. తనపై వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. రాజకీయంగా తనను దెబ్బ కొట్టేందుకు ఇలా బురద జల్లే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



నాగనాతనహళ్లిలో ఏకగ్రీవంగా ఎన్నికైన వారితోపాటు టీడీపీ సీనియర్ నేతలకు సన్మానం



జొన్నగిరిలో సాగు నీటి సంఘం అధ్యక్షుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



వెల్దుర్తి వీరన్నగట్టు చెరువుకు ఎంపికైన సభ్యులు



హొళగుందలో సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన టీడీపీ నాయకులకు సన్మానం



ఆలూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కిష్టప్ప, సభ్యులు



కామినహాల్ సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



హాలహర్విలో ఏకగ్రీవమైన సభ్యులు



సాగు నీటి సంఘం చైర్మన్‌గా గెలుపొందిన రంగన్నకు సన్మానం



హత్తిబెళగల్ చెరువు చైర్మన్ దాసరి ఈరప్పకు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న అధికారులు

సమష్టి కృషితోనే ఏకగ్రీవాలు

ఆలూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితోనే సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం ఆలూరు టీడీపీ కార్యక్రమంలో ఆయన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు వేదవతి ప్రాజెక్టు భూసేకరణకు నిధులు కేటాయిస్తారన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనరులు తిప్పయ్య, అశోక్, నాయకులు మిక్కిలి నేని ప్రసాద్, కిష్టప్ప, రాంనాథ్ యాదవ్, పాల్ రెడ్డి, నారాయణ చౌదరి, ఈరన్న నాయుడు, కృష్ణం నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ఆలూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబుతోనే సాగు నీటి సంఘాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, మహిళా నేత వైకుంఠం జ్యోతి అన్నారు.. శనివారం సాగు నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన వారిని వారు అభినందించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సాగు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించారని తెలిపారు.



ఎన్నికైన వారితో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

రహదారులకు ప్యాచ్‌వర్క్

తుగ్గలి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుత్తి, పత్తికొండ ప్రధాన రహదారుల్లో గుంతలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతుం డటంతో గమనించి రూ.4 లక్షలతో గుంతలు పూడ్చి మరమ్మతులు చేప డుతున్నామనీ కాంట్రాక్టర్ సంజీవచౌదరి అన్నారు. శనివారం తుగ్గలి వద్ద రైల్వే స్టేషన్ సమీపాన గుంతలు పడ్డ రహదారిలో ఉన్న కంకరను తొలగించి ప్యాచ్‌వర్కు చేసి గుంతలు పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 లక్షలతో ప్యాచ్‌వర్కులు చేయడానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు.

పంటల బీమా నమోదుకు నేడు ఆఖరు

మద్దికెర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు పంటల బీమా చేసుకోవడానికి ఆదివారం ఆఖరి రోజు అని వ్యవసాయ శాఖ మండల అధికారి యు.రవి తెలిపారు. శనివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ పంటల బీమా చేసుకోవడా నికి 15వ తేదీ ఆఖరు అన్నారు. పంటల బీమా చేసుకోవడం వల్ల ఏదైనా అతివృష్టి, అనావృష్టి జరిగి పంటలు దెబ్బతింటే బీమా వస్తుందన్నారు. ఈ సమావేశంలో వీఏఏ జాకీర్ రైతులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీపీ నాయకులు

ఎమ్మిగనూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలని ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ షూకూర్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సుభాన్, ఎమ్మిగనూరు అధ్యక్షుడు ఉసేన్‌బాషా అన్నారు. శనివారం స్థానిక ఖురైషి ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌డీపీఐ సమావేశం నియోజకవర్గ కార్యదర్శి నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సభ్యులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్‌హతవుల్లా, కార్యదర్శి అబ్దుల్‌గని, తాహిర్, జమీర్‌లాల్, యూసూఫ్ పాల్గొన్నారు.

అవమానపరచడం సరికాదు

ఎమ్మిగనూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా శనివారం పార్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డిని అవమానించడం పోలీసులకు, అధికార పార్టీకి సరికాదని వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జి బుట్టా రేణుక శనివారం పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీకి ఏకపక్షంగా పోలీసు అధికారులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరించారన్నారు. వైసీపీకి మద్దతుగా నిలిచిన రైతులను రానివ్వకుండా అడ్డుకొని ఎన్నికలు జరపడం అప్రజాస్వామికమన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని అమర్యాదగా మాట్లాడడం, పోలీసులు దురుసుగా ప్రవర్తించిన తీరు ఎన్నికల నియమావళిని అపహాస్యం చేయడమేనన్నారు.

గోనెగండ్లలో గ్రామోత్సవం



గోనెగండ్లలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామికి తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయంలో భద్రకాళిదేవి, వినాయకస్వామి, నందీశ్వర స్వామి, విగ్రహ, ఆలయ గోపుర కలశ ప్రతిష్ఠను రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. షాపూర్ జగద్గురు గిరిమల్లేశ్వర వివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు జరుగుతున్నాయి. శనివారం దీక్షాహోమం, విగ్రహ గ్రామోత్సవం, శాంతిహోమం, ప్రధాన దేవాల హోమాలు వీరశైమఠం పీఠాధిపతి శివయ్య స్వామి వారికి తులాభారం ఘనంగా నిర్వహించారు.

నేడు ఆంజనేయస్వామి రథోత్సవం



ముస్తాబైన మార్లబండ ఆంజనేయస్వామి రథోత్సవం

కోసిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోసిగి సజ్జల గుడ్డం పొలాల్లో వెలసిన మార్లబండ అంజనేయస్వామి కార్తీక మాస ముగింపును పురస్కరించుకొని ఆదివారం ప్రత్యేక పూజలతో పాటు రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు విశ్వనాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి, ఆలయ పూజారి శ్రీరాము తెలిపారు. ఆదివారం సాయంత్రం కుంభాలతో, కలశాలతో డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వచ్చి స్వామివారికి నైవేద్యాలు సమర్పిస్తారు. అనంతరం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు కోసిగి, సజ్జలుగడ్డం, జంపాపురం, ఐరంగల్ తదితర గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొనున్నారు.



పూజలందుకుంటున్న మార్లబండ ఆంజనేయస్వామి

పడి లేచిన ఉల్లి

- ఒక్కసారిగా పెరిగిన ఉల్లినారు ధర
- ఒక బెడ్(మడి) ధర రూ. 500 నుంచి రూ. 3000



గోనెగండ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లినారు

గోనెగండ్ల, డసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒక్క సారిగా ఉల్లి నారు ధర ఆకాశాన్ని అంటింది. గత నెల రోజుల క్రితం ఉల్లికి ధర తగ్గడంతో నిన్న మొన్నటి వరకు ఉల్లి నారు వైపు కన్నెత్తి చూడని రైతులు మార్కెట్‌లో ఉల్లి ధర పెరుగుతుండటంతో పంట సాగు చేసేందుకు అధిక ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం రైతులకు ఉల్లినారు చిక్కడం కష్టతరంగా మారింది. గత నెల రోజుల క్రితం ఉల్లి మడి ధర రూ. 500 పలికింది. నేడు మడి రూ. 2500నుంచి రూ. 3000 వరకు ధర పలుకుంది. ఉల్లికి ధర పెరగడంతో నారు సాగు చేసిన రైతులు అమాంతంగా రేటు పెంచేశారు. ఉల్లి విత్తనాల రేటు కూడా కిలో రూ. 150 నుంచి రూ. 600 వరకు పెరిగింది. ఒక ఎకరానికి 200 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. అయితే గత కొన్ని రోజులుగా ఉల్లి కి ధర లేక పోవడంతో ఉల్లి నారు సాగు కు రైతులు మక్కువ చూపలేదు. ఇప్పటికి మండలంలో ఉల్లి నారు సాగు చేసిన పొలాలో ఉల్లి నారు అయిపోయింది. ధర పెరగడంతో మళ్లీ ఉల్లినారును సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రశాంతంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- 14చోట్ల టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం
- పార్లపల్లిలో ఉద్రిక్తత
- మాజీ ఎమ్మెల్యే, పోలీసుల మధ్య వాగ్వాదం
- రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట

ఎమ్మిగనూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో శనివారం జరిగిన సాగునీటిసంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. నియోజకవర్గంలో ఉన్న 14 సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు టీడీపీ మద్దతుదాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 168 టీసీలు ఉండగా 164 టీడీపీ, నాలుగు చోట్ల వైసీపీ మద్దతుదారులు ఎన్నికయ్యారు.

● పార్లపల్లిలో ఉద్రిక్తత

ఎమ్మిగనూరు మండలంలోని కలుగొట్ల 35, 36, పార్లపల్లిలో 38వ సాగు నీటి సంఘాలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలను పర్యవేక్షించేందుకు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కలుగొట్ల గ్రామానికి వెళ్లి పోలింగ్ కేంద్రంలోకి వెళ్తుండగా సీఐ, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన వందమీటర్ల దూరంలో రోడ్డుపైనే కుర్చీ వేసుకొని కూర్చున్నారు. అక్కడ కొద్దిసేపు కూర్చొని పార్లపల్లిలో జరిగే పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన దగ్గరకు చేరుకొని నామినేషన్లు వేసేందుకు లోపలికి వదలడం లేదని గేటుకు తాళాలు వేశారని చెప్పారు. రైతులు గుమిగూడటంతో సీఐ ఇబ్రహిం అక్కడికి చేరుకొని పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లరాదని వెనక్కి వెళ్లాలని సూచించారు. అయితే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ససేమిరా అనడంతో సీఐ, మాజీ ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. సీఐ దురుసుగా మాట్లాడడంతో మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పార్లపల్లిలో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. ఎన్నికలు ముగిసే వరకు ఇక్కడే ఉంటానని రోడ్డుపై బైఠాయించారు. అంతలోపే ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అక్కడికి చేరుకొని మాజీ ఎమ్మెల్యేకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తాను ఎన్నికలు ముగిసిన తర్వాతే వెళ్తానని భీష్మించారు. అన్ని ఏకగ్రీవం అయ్యాయని తెలిసిన తర్వాత మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ, పోలీసులు కలిసి పోలింగ్ కేంద్రం గేట్లకు తాళాలు వేసుకొని ఏకపక్షంగా ఎన్నికలు జరుపుకుంటున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలపై కోర్టుకు వెళ్తామన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండల పరిధిలోని 34,35, 36, 38 సాగునీటి సంఘాలకు శనివారం అధికారులు ఎన్నికలు నిర్వహించారు. నాలుగు సాగునీటి సంఘాలకు టీడీపీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 34వ సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా గుడికల్లు అయ్యన్న, ఉపాధ్యక్షులుగా పద్మసాలె నరసింహులు, 35వ సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా కలుగొట్లకు చెందిన బోయ నాగేష్, ఉపాధ్యక్షులుగా సోగనూరుకు చెందిన మచ్చేంద్ర, 36వ సంఘానికి అధ్యక్షుడిగా తిమ్మాపురానికి చెందిన హేమంత్‌నాయుడు, ఉపాధ్యక్షులుగా కె. నాగలాపుకు చెందిన శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అలాగే 38వ సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా కడిమెట్లకు చెందిన సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా గువ్వలదొడ్డికి చెందిన శివన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 48 మంది టీసీ మెంబర్లు సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎంఐ ట్యాంకులు ఏకగ్రీవం: కొండమ్మ చెరువు, పెసలదిన్నె తిమ్మారెడ్డి చెరువులకు ఆయా గ్రామాల్లో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఇక్కడ కూడా టీడీపీ మద్దతుదారులు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొండమ్మ చెరువుకు బోయ కౌలుట్లమ్మ, ఉపాధ్యక్షులుగా ఈడిగ నీలమ్మ, పెసలదిన్నెలోని తిమ్మారెడ్డి చెరువుకు అధ్యక్షులుగా బుడ్డ కేశన్న, ఉపాధ్యక్షులుగా సామేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు, సీఐ, ఇబ్రహిం, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, బందోబస్తును ఏర్పాటు నిర్వహించారు.

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం మండలాల్లో టీడీపీదే హవా కొనసాగింది. 23 సాగునీటి ఎన్నికలు జరగగా.. ఇందులో 21 అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా టీడీపీ కైవసం చేసుకోగా.. వైసీపీ రెండు మైనర్ నీటి సంఘాలకు మాత్రమే పరిమితమైంది. నాలుగు మండలాల్లో అన్ని ఏకగ్రీవం జరుగా.. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణిలో మాత్రం టీడీపీ వర్గీయుల మధ్యనే ఓటింగ్ నిర్వహించారు. ఇందులో సత్యన్నగౌడు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో అధికారులు, ఆయా పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. డీఎస్పీ ఉపేంద్రబాబు, మంత్రాలయం, కోసిగి, కౌతాళం సీఐలు రామాంజులు, అశోక్ ఎన్నికలు సజావగా జరిగేందుకు ముందస్తు ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నారు. గెలుపొందినవారిని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, రమాకాంత్ రెడ్డి, రఘునాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, గోపాల్ అభినందించారు.

బూదూరులో ఉద్రిక్తత : మంత్రాలయం మండలంలో సాగునీటి సంఘం ఎన్నికలు బూదూరులో ఉద్రిక్తత నెలకొంది. బూదూరులో వైసీపీ, టీడీపీ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటా పోటీ జరుగుతుండటంతో ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీబీ డ్యాం మాజీ ఉపాధ్యక్షుడు నర్సారెడ్డి వైసీపీ మద్దతుదారులకు అండగా నిలవడంతో అధికారులు నచ్చజెప్పారు. మేజర్ నీటి సంఘాలైన మాధవరం అధ్యక్షుడిగా భీమరాయుడు, ఉపాధ్యక్షుడు తిరుమల్ నాయక్, రచ్చుమర్రిలో అధ్యక్షుడుగా వెంకట్రాముడు, ఉపాధ్యక్షుడుగా ఉరుకుందు, మాలపల్లిలో అధ్యక్షుడుగా చంద్ర, ఉపాధ్యక్షుడు గోవిందప్ప, చెట్నహళ్లిలో నరసింహులు, ఉపాధ్యక్షులు రామలింగప్ప, బూదూరులో ఈడిగ శివరామగౌడు, ఉపాధ్యక్షుడుగా ముకురన్న ఎన్నికయ్యారు. మైనర్ సాగునీటి సంఘాలైన రాంపురంలో అధ్యక్షుడుగా కారుమంచి నారాయణ, ఉపాధ్యక్షుడుగా అంజినేయ, ఖగ్గల్లులో రవీంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడుగా చంద్రశేఖర్‌లు వైసీపీ మద్దతుదారులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో 72 టీసీ మెంబర్లు ఉండగా.. 56 టీడీపీ, 15 వైసీపీ, ఒకటి బీజేపీ కైవసం చేసుకుంది. ఎన్నికల్లో తహసీల్దార్ రవి, ఎంపీడీవో శోభారాణి, పుల్లయ్య, డీటీలు జీకే గురురాజరావు, సరస్వతి, రవీంద్రబాబు, మాదవరం ఎస్ఐ విజయకుమార్, ఏవో జీర గణేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని ఎనిమిది డబ్ల్యూఏ ప్రెసిడెంట్లకు ఎన్నికలు జరిగాయి. టీసీ సభ్యుల ఎన్నిక ఉదయం, సాయంత్రం డబ్ల్యూఏ ప్రెసిడెంట్ ఎన్నిక నిర్వహించారు. సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఎల్లెల్సీ, జీడీపీ కాలువకు డబ్ల్యూఏ ప్రెసిడెంట్‌లుగా టీడీపీ సానుభూతి పరులే ఎన్నికయ్యారు. గోనెగండ్ల సెక్షన్ ఎల్లెల్సీ కింద వీడీ కాలువకు ప్రెసిడెంట్‌గా కల్లపారి రంగముని, వైస్ ప్రెసిడెంట్‌గా కులుమాల రంగస్వామి, డీపీ 86 కాలువకు బాయిగడ్డ ఉసేన్ ప్రెసిడెంట్‌గా, వైస్ ప్రెసిడెంట్‌గా రాళ్ల దొడ్డి గొల్ల మల్లేష్, ఎంఎల్‌ఎస్‌పీ కాలువకు ప్రెసిడెంట్ కే. శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్‌గా, కురువ కృష్ణ, ఎన్నికయ్యరు. అలాగే గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న కాలువలకు హెచ్ కైరవాడి కాలువకు ప్రెసిడెంట్‌గా రామనరసప్ప, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రెమరి ఏసన్న, ఒంటెదుదిన్నె కాలువకు ప్రెసిడెంట్‌గా పుట్టపాశం బీటీ బడేసా, వైస్ ప్రెసిడెంట్‌గా చాకలి నాగన్న, తిప్పనూరు కాలువకు ప్రెసిడెంట్‌గా బోయ కౌలుట్లయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా చిన్నరాముడు, కున్నూరు కాలువకు ప్రెసిడెంట్‌గా బోయ కృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ గా లక్ష్మీదేవమ్మ, లింగందిన్నె కాలువకు ప్రెసిడెంట్‌గా కురువ రంగన్న, వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పరి రాముడు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా కేంద్రాల్లో ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసిన ఎమ్మెల్యే బీవీ:
గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలలాలో తమ పార్టీ సానుభూతిపరులను గెలిపించుకోవడానికి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పగడ్బందీ వ్యూహాన్ని అమలు చేశారు. ఏకాలువ సంఘంలో ఏ గ్రామాలు ఉన్నాయి అందులో ఏ వ్యక్తి రైతులలో మంచి పేరు ఉంది. రైతుల, పార్టీ కోసం ఎవరు పాటు పడతారో ఆలోచించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయన అనుసరించిన వ్యూహంతో అన్ని మండలాలలోని కాలువ సంఘం ప్రెసిడెంట్ స్థానంలో సునాయాసంగా గెలుపొందారు.

కోసిగి : కోసిగి మండలంలో సాగునీటి సంఘం ఎన్నికల్లో టీడీపీ తన హవా కొనసాగించింది. మండలంలోని జంపాపురంలో 17, కామన్‌దొడ్డిలో 15, సాతనూరులో 16 సంఘాల్లో 36 మంది టీసీ మెంబర్లకు గాను 34 టీసీ మెంబర్లను టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకోగా.. ఒకటి బీజేపీ, మరొకటి వైసీపీ కైవసం చేసుకున్నట్లు ఆయా ఆర్వోలు నిత్యానంద రాజు, వెంకటేశ్వర్లు, రవిప్రసాద్‌లు తెలిపారు. జంపాపురం అధ్యక్షులుగా జే.అనంతసేనారెడ్డి (టీడీపీ), ఉపాధ్యక్షులుగా ఏ.తమ్మారెడ్డి (బీజేపీ) ఎన్నికయ్యారు. కామనదొడ్డిలో అధ్యక్షునిగా శివారెడ్డి (టీడీపీ), ఉపాధ్యక్షులుగా బోయ రవి (టీడీపీ), సాతనూరులో అధ్యక్షులుగా తమ్మలి విరుపాక్షి (టీడీపీ), ఉపాధ్యక్షుడుగా కురువ శివశంకర్ (టీడీపీ) ఎన్నికయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ పోలీసు బందోబస్తు చేశారు.

కౌతాళం: మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 7 మేజర్ సాగునీటి సంఘాలు, ఒకటి మైనర్ సాగునీటి సంఘం ఉన్నది. మొత్తం 8 సాగునీటి సంఘాలకు గాను 90 మంది టీసీ మెంబర్లు ఉండగా 85 టీడీపీ, 4 వైసీపీ, 1 బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కౌతాళం-1 మేజర్ కాలువకు డింగి రఘురాం, రామాంజనేయ రాజు, కౌతాళం-2కు ఓబుళాపురం సిద్దయ్య, రంగస్వామి, రౌడూరుకు పంపనగౌడ్, మాబుసాబ్, సుళేకేరికు నాగేంద్ర రెడ్డి, నాగభూషణ్, బదినేహల్‌కు టిప్పుసుల్తాన్, లక్ష్మీ, కుంబళనూరుకు మహేష్, ఈరన్న, హల్వికు భీమన్న, చిన్న ఈరన్నలను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగాను మైనర్ సాగునీటి సంఘం వల్లూరుకఉ దేవప్పగౌడ్, వడ్డే ఎల్లప్పలను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులను మండల టీడీపీ నాయకులు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పెద్దకడుబూరు : మండలంలో ఐదు సాగునీటి సంఘాలను టీడీపీ కైవసం చేసుకుంది. పెద్దకడబూరు-1(20)లో అధ్యక్షుడిగా నరవ రమాకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోటెకల్ ఆదెప్ప, పెద్దకడబూరు-2(21) అధ్యక్షుడిగా కల్లుకుంట అల్లింగప్ప, ఉపాధ్యక్షుడిగా బొగ్గుల క్రాంతికూమార్, కంబళదిన్నే-22కు అధ్యక్షుడిగా కురువ గజ్జెళ్ల చిన్ననాగన్న, ఉపాధ్యక్షుడిగా సొరాయి చిన్న వీరేష్, చిన్నతుంబళం-23 అధ్యక్షుడిగా చాకలి చిన్న నారాయణ, ఉపాధ్యక్షుడిగా బోయ చంద్ర, మురవణి-26కు అధ్యక్షులుగా సత్యన్న గౌడ్, ఉపాధ్యక్షుడిగా బోయ యంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దకడబూరు-1 (20) లో బనవాసి కింద ఉన్న 10టీసీ ఎన్నికలపై బనవాసికి చెందిన వైసీపీ నాయకుడు బసిరెడ్డి, టీడీపీ నాయకుడు అయ్యలప్పకు మధ్య తోపులాట జరిగింది. ఎస్ఐ నాయక్, ఇరువురిని బయటకు పంపారు. మురవణి-26లోని 4వ టీసీకి టీడీపీకి చెందిన ఇరువర్గాలు పోటీలో నిలబడగా సత్యన్నగౌడ్ ఏడు ఓట్ల తేడాతో గెలుపొందాడు. కంబళదిన్నెలో కూడా టీడీపీకి చెందిన ఇరువర్గాలు పోటీ చేయగా గజ్జెల చిన్ననాగన్న విజయం సాధించారు. సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులుగా తహసీల్దార్ శ్రీనాథ్, ఎంపీడీవో జయరాముడు, ఏఈలు సాయికుమార్, చిన్నరాజప్ప, రాజశేఖర్ వ్యవహరించారు.

నందవరం: మండలంలో ఏడు డబ్ల్యూఏలను టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. నందవరం డబ్ల్యూఏ 27కు అధ్యక్షుడు ఎర్రంనాయుడు, వైస్ ప్రెసిడెంట్‌గా జగ్గాపురం ఈరన్న, 28కు అధ్యక్షుడు రామన్న గౌడు, వైస్ ప్రెసిడెంట్‌గా హనుమన్న, 31కు హలహర్వి అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడుగా హనుమన్న, నదికైరవాడి 30కు అధ్యక్షుడిగా ఖాశీం, ఉపాధ్యక్షుడుగా సత్యనారాయణరెడ్డి, 37కు శీలం గోపాలరెడ్డి, ఉపాధ్యాక్షుడిగా కె ఈరన్న, 33కు అమర్నాథరెడ్డి, ఉపాధ్యక్షుడుగా మల్లేశప్ప, కనకవీడు 32కు అధ్యక్షుడుగా వీరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చివరిలో కనకవీడు.. మిట్టా సోమాపురం గ్రామాల్లో ఉత్కంఠగా మారింది. నాలుగు టీడీపీ మద్దతుదారులు కైవసం చేసుకోగా, నాలుగు వైసీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు.



పార్లపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే, సీఐ ఇబ్రహీం వాగ్వాదం



35వ సాగునీటి సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికైన బోయ నాగేష్ ఎమ్మెల్యే బీవీని కలిసి సన్మానించిన దృశ్యం



గోనెగండ్ల ఎల్లెల్సీ సెక్షన్‌లో ధ్రువీకరణపత్రం అందుకుంటున్న బాయిగడ్డ ఉసేన్, టీసీ సభ్యులు



నందవరంలోని సీకే డబ్ల్యూఏ 31కు ఏకగ్రీవమైన వారికి డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న అధికారులు



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు



ఎన్నికైన అభ్యర్థులను అభినందిస్తున్న టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి



ఎన్నికైన వారిని అభినందిస్తున్న రాఘవేంద్రరెడ్డి



సాగునీటి సంఘం ఎన్నికల్లో టీసీ మెంబర్లుగా ఎన్నికైన వారికి డిక్లరేషన్ ఫాంను అందజేస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్లు



టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న నీటి సంఘానికి ఎన్నికైన అధ్యక్షులు

లోక్ అదాలత్‌లో 1,457 కేసులు పరిష్కారం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 1457 కేసులు పరిష్కారం అయ్యాయి. కోర్టు అధికారులు తెలిపిన సమాచారం మేరకు న్యాయాధికారులు జోష్ణదేవి, శ్రీలత ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కేసులు -52, చెక్‌బౌన్స్ కేసులు రెండు, సివిల్ దావాలు నాలుగు, మద్యం కేసులు 23, అడ్మిషన్ కేసులు 1496 పరిష్కారం చేశారు. లోక్ అదాలత్‌లో ఏపీపీ సాల్మాన్, లోక్ అదాలత్ సభ్యులు గురురాజారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మురళికృష్ణ, యోసేపు, రంగనాథ్, లింగమూర్తి, నబి రసూల్, కోర్టు కానిస్టేబుల్ రామాంజనేయులు పాల్గొన్నారు.

రంగన్న మృతి పార్టీకి తీరని లోటు



టీడీపీ నాయకుడు నాడిగేని రంగన్న పాడెను మోస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి

కోసిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయుడు నాడిగేని రంగన్న అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డికి ముఖ్య అనుచరుడు అయిన నాడిగేని రంగన్న భౌతికకాయానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ తెలుగు యువత పాలకుర్తి దివాకర్ రెడ్డి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్యపడవద్దని తెలిపారు. అనంతరం నాడిగేని రంగన్న పాడెను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి మోశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భరద్వాజశెట్టి, రవితేజ శెట్టి, ఎల్లారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, వీరారెడ్డి, పంపాపతి, మారెప్ప, రామయ్య, కృష్ణారెడ్డి, రామాంజనేయులు, సోల్మాన్, నీలకంఠ, ఉలిగయ్య, రామయ్య పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల కోలాహలం

మంత్రాలయం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. శని, ఆదివారం సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అద్దె రూములు దొరకక మధ్వమార్గ్ కారిడార్ ప్రాంగాణంలోనే చలిని సైతం లెక్క చేయకుండా భక్తులు బసచేశారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



మధ్వమార్గ్ కారిడార్‌లో కిక్కిరిసిన భక్తులు

శ్రీవారిని దర్శించుకున్న పీఠాధిపతి

రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా శనివారం తిరుమల తిరుపతి క్షేత్రంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. పీఠాధిపతికి టీటీడీ ఈవో శ్యామలరావు, అర్చకులు, పండితులు స్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని అనంతరం అక్కడ రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ద్వారపాలక అనంతస్వామి, టీటీడీ మఠం మేనేజర్ అనిల్ కుమార్, పవనాచార్, ప్రకాషాచార్, దేశాయ్ నరసింహ, అనంతపు రాజిక్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

కోసిగి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు పెద్దపీట వేసిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోయ రామాంజనేయులు అన్నారు. శనివారం కోసిగిలోని విభిన్న ప్రతిభావంతుల యువసేన అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో రూ.3వేలు ఉన్న పింఛన్‌ను రూ.6వేలకు పెంచిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లకు దివ్యాంగుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

● **నూతన కమిటీ ఎన్నిక:** దివ్యాంగుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బుగేని రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా పందికోన రాజేష్, మైనరసప్ప, సెక్రటరీగా జి.వెంకటేశ్, జాయింట్ సెక్రటరీలు హనుమంతు, లక్ష్మి, సాయిబాబు, ట్రెజరర్‌గా పి.గోపాల్, సభ్యులుగా వీరేష్, ఈరన్నతో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు బోయ రామాంజనేయులు